ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 1



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

మంగళవారం 3 జూన్ 2025

బియ్యం ఆపేశారయ్యా..

నా ఆకలి తీర్చేదెవరు!?




ఈయన పేరు షేక్ మౌలాలి. బుజ బుజనెల్లూరు వాసి. 62 ఏళ్ల వృద్ధుడు. పుట్టుకతోనే రెండు చేతులు లేవు. కాళ్లూ చచ్చుబడ్డాయి. భార్య షంషాద్ వేలిముద్రవేసి 35 కేజీల బియ్యం తీసుకునేది. అయితే, అనుకోని పరిస్థితుల్లో గతేడాది షంషాద్ మృతి చెందింది. అప్పటినుంచి వేలి ముద్ర వేసే దిక్కు లేకపోవడంతో బియ్యం పంపిణీని అధికారులు ఆపేశారు. వేలి ముద్ర వేస్తేనే బియ్యం ఇస్తామనే హుకుం జారీ చేశారు. తన మొరను ఉన్నతాధికారులకు చెప్పుకుందామని రెండు సార్లు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చాడు. అయినా స్పందించలేదు. చివరకు మూడోసారి కూడా కలెక్టరేట్‌కు చేరుకుని తన దీనావస్థను కనబడ్డ అధికారులకు చెప్పుకుని కన్నీటిపర్యంతమయ్యాడు.

- ఇలాంటి ఎందరో అభాగ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు మొరపెట్టుకున్నారు.

8

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాకు ఉత్తమ ర్యాంకులు

నెల్లూరు (విద్య), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. గత నెల 18వ తేదీన జరిగిన ఈ పరీక్షలకు జిల్లాలో 2వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. సోమవారం విడుదలైన ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటుతూ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. జాతీయస్థాయిలో మధుకిరణ్ 133, పూర్వజ్ 332, సంతోష్ 1361, భానుకిరణ్ 1563, అఖిలేష్ 2323, యశ్వంత్‌బాబి 2481, సాయికేత్విక్ 2517 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ ఐఐటీల్లో సీట్లు సాధించి సాఫ్ట్‌వేర్లుగా రాణిస్తామని తెలిపారు.



బొ'ప్పాయె'!

గత నెల కిలో రూ.16.. ఇప్పుడు రూ.ఆరే

బొప్పాయి సాగుదారులను ధర కలవరపెడుతోంది. గత నెలలో కిలో రూ.16 పలికిన కాయ ఇప్పుడు ఆరు రూపాయలకు పడిపోయింది. అనంతసాగరం మండలంలోని సంజీవనగరం, గౌరవరం, చిలకలమర్రి, చాపురాళ్లపల్లి, యాకర్లపాడు, బొమ్మవరం, అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 700 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉంది. ఒక ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షలు ఖర్చు అవుతుంది. అందుకు తగ్గట్టు 30 నుంచి 40 టన్నుల దిగుబడి రావాలి. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. ఇక్కడ నుంచి కోల్‌కతా, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు బొప్పాయిని ఎగుమతి చేస్తారు. చిప్స్, రసాయనాలు, కిళ్లీ సామగ్రి తయారు చేస్తారు. బొప్పాయి కాయలతో వచ్చిన పాలను మెడిసిన్ తయారీకి వినియోగిస్తారు. ప్రస్తుతం డిమాండ్ ఆశాజనకంగా ఉన్నా వ్యాపారులు, దళారులు ఏకమై ధరను పతనావస్థకు చేర్చారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత నెలలో కిలో రూ.16 పలకగా ఇప్పుడు 6లకు మించడం లేదు. ఇటు దిగుబడి లేక.. అటు ధర లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

విద్యుత్ షాక్‌తో ఇద్దరు డ్రైవర్ల మృతి

మృతులది తమిళనాడులోని విల్లుపురం

విడవలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివర్తి గ్రామంలోని రొయ్యల గుంతల వద్ద ఆదివారం రాత్రి విద్యుదాఘాతానికి గురై తమిళనాడుకు చెందిన ఇద్దరు కంటైనర్ డ్రైవర్లు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... ముదివర్తి పంచాయతీ పరిధిలో రొయ్యలను సాగు చేస్తున్న రాధయ్య పుదిచ్చేరిలోని స్టార్ హేచరీ నుంచి రొయ్య పిల్లలను కొనుగోలు చేశారు. దీంతో ఆ హేచరీ నిర్వాహకులు రెండు కంటైనర్లలో రొయ్య పిల్లలను ముదివర్తి గ్రామానికి పంపారు. ఆదివారం రాత్రి గుంతల వద్దకు వచ్చిన కంటైనర్లు రొయ్యల పిల్లలను అన్‌లోడ్ చేయడానికి డ్రైవర్ లోక్‌నాథ్ (45) లారీని గుంత కట్టమీదకి ఎక్కించాడు. దీంతో గుంతలపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు లారీకి తగలటంతో విద్యుత్ లారీ మొత్తం ప్రసరించింది. దీంతో డ్రైవర్ లోక్‌నాథ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈయన్ను కపాడే ప్రయత్నంలో మరో కంటైనర్ డ్రైవర్ మణి (25) కూడా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులిద్దరిదీ తమిళనాడులోని వీల్లుపురానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ తెలిపారు.



రొయ్యల గుంతల గట్టుపై కంటైనర్ పక్కన పడి వున్న లోక్‌నాథ్, మణి మృతదేహాలు

12న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10గంటల నుంచి ప్రణాళిక, ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర అంశాలపై సాయంత్రం వరకు చర్చించనున్నట్లు పేర్కొన్నారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు అధికారులు, సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

6 నుంచి డీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (విద్య) : డీఎస్సీ పరీక్షలను ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో పొందాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చే సమయంలో హాల్‌టికెట్‌తో రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాలని తెలిపారు. హాల్‌టికెట్‌లో పుట్టిన తేదీ, నివాసం, పేర్లు తదితర పొరపాట్లు ఉంటే పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ వద్దనున్న నామినల్ రోల్స్‌లో సరిచేసుకోవాలని కోరారు.

జంతువులను హింసిస్తే కఠిన చర్యలు

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ నాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగల సందర్భంగా జంతువులను హింసిస్తే జంతు హింస నివారణ యాక్టు 1960 ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు జిల్లా నోడల్ అధికారిగా సహాయ సంచాలకురాలు డి.మాధవీలతను నియమించినట్లు తెలిపారు. జంతు సంరక్షణ చట్టాలు తప్పక పాటించాలని అతిక్రమిస్తే పోలీసులు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్సైజ్ డీసీగా శంకరయ్య

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం శంకరయ్యను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డీసీగా ఉన్న శ్రీనివాసరావు గత నెలలో పదవీవిరమణ పొందారు, కాగా, శంకరయ్య విజయనగరం ఏసీగా, సెబ్‌లో విజయవాడ డీసీగా విధులు నిర్వహించి ప్రస్తుతం హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నారు.

6న ఐటీఐలో కౌన్సెలింగ్

నెల్లూరు (విద్య) : జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 6వ తేదీన నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా హేనా సుజన్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లా స్త్రీ శిశుసంక్షేమాధికారిగా హేనాసుజన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న సువర్ణ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. స్త్రీ శిశుసంక్షేమాధికారిగా గతంలో పని చేసిన హేనాసుజన్ రెండోసారి జిల్లాకు వచ్చారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

ఉదయగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతిఒక్కరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. యోగాతో అనేక ఉపయోగాలున్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9315
వెండి కిలో ధర	రూ. 100600
వెండి ఒక గ్రాము	రూ. 103.60



పాడి రైతులకు సంక్షేమ పథకాల మంజూరు

● ఎస్‌వీ రాఘవేంద్రశర్మ, పశువైద్యాధికారి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అన్ని గ్రామ పంచాయతీల్లోని అర్హులైన పాడి రైతులందరికీ అందేలా చర్యలు చేపడుతున్నట్లు పశువైద్యధికారి ఎస్‌వీ రాఘవేంద్ర శర్మ తెలిపారు.

? పాడి రైతులకు దాణా సరఫరా చేస్తున్నారా.

! ప్రభుత్వం సరఫరా చేసిన మేరకు ఇటీవల రాయితీపై 6.5 టన్నులు పంపిణీ చేశాం. వారం రోజుల్లో మరో 8.5 టన్నులు సరఫరా అయ్యే అవకాశం ఉంది.

? పశుగ్రాసం కొరత నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! పశుగ్రాసం కొరత ఉన్నమాట వాస్తవమే. ప్రస్తుతం చిన్న, సన్నకారు రైతులకు ఉపాధిహామి పథకం కింద పశుగ్రాసం సాగు చేసేందుకు రూ. 39 వేల వరకు రాయితీ అందజేయడం జరుగుతుంది.

? ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది.

! ప్రస్తుతం గేదెలకు గురక, మూగజీవాలకు నేల మురక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. అలాంటి వాటికి ప్రభుత్వం తరపున ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

న్యూస్ బాక్స్

ఘనంగా దుగ్గిరాల జయంతి



దుగ్గిరాలకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం ఉద్యమ నాయకుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి విద్యార్థులు నివాళులు అర్పిచారు. కార్యక్రమంలో గ్రంథ పాల కుడు నారాయణరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వింజమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన కొలతల ప్రకారం ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఏపీఓ సుభాషిణి అన్నా రు. వింజమూరు పంచాయతీ పరిధిలోని బోటు సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. క్షేత్ర సహాయకులు బి రమణయ్య చేయిస్తున్న పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఉపాధి శ్రామికులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

వింజమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఈవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలానికి 29810 పాఠ్య పుస్తకాలు ఎంఆర్సీ పాయింట్‌కి వచ్చాయని, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

నవోదయ తరగతుల ప్రారంభం

వింజమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్రహ్మణ్య నవోదయ, సైనిక్ స్కూల్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ బీఎస్ రాజు మాట్లాడుతూ ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.రవి, అకాడమీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడిగా రవీంద్ర బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గుంటుపల్లి కొండయ్యచౌదరి-సుబ్బమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆర్ రవీంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి మండలం రుద్రకోట ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి కల్పిస్తూ గండిపాళెంకు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

మరమ్మతుకు నోచుకోని కాలువ తూము

● వృథాగా పోతున్న సోమశిల జలాలు
● పట్టించుకోని అధికారులు



అలుగు నుంచి వృథాగా కిందకు పోతున్న సోమశిల జలాలు

అనంతసాగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల ఉత్తర కాలువ పరిధిలోని కొత్తపల్లి చెరువుకు నీరు సరఫరా చేసే ఉప కాలువ తూము మరమ్మతులకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో సోమశిల జలాలు వృథా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ తూము తుప్పుపట్టి అధ్వానంగా తయారైంది. ఈకారణంగా కాలువ గుండా చెరువుకు నీరుచేరి అలుగు ద్వారా బయటకు వెళ్తోంది. ఎండ తీవ్రత కారణంగా సోమశిల జలాశయంలో నీరు ఆవిరి రూపంలో కొంత వృథా అవుతుండగా, డెల్టా, నాన్‌డెల్టా పరిధిలో రెండవ పంటకు నీరు సరఫరా చేస్తుండడంతో జలాశయం నీటి మట్టం తగ్గిపోతోంది. ఇలాంటి సమయంలో ఉన్న జలాలు వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని, ఈవిషయం ఇటీవల మాజీ సర్పంచు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని బైపాస్‌రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం వితరణ గావించారు.

కాంక్రీట్ పనుల పరిశీలన

ఉదయగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవన పునఃనిర్మాణ పనులను సోమవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 27 లక్షల పంచాయతీరాజ్ నిధులతో భవన పునఃనిర్మాణ పనులు చేపడుతున్నారని, ప్రస్తుతం జరుగుతున్న బెడ్ కాంక్రీట్ పనులను పరిశీలించామన్నారు. కాంక్రీట్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఉదయగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ రైతుసేవా కేంద్రంలో సోమవారం మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కంభం జన్మదిన వేడుకలు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి 69వ జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఫోన్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉండేలా గురవారెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, అన్నపురెడ్డి చినవెంగళరెడ్డి, చిన్నపురెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 649 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 459 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 190 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 200 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

సోమశిలలో 41.923 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 41.923 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 390 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,150, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

సంగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సంగం - కలిగిరి రహదారి పక్కన ఆర్చికి సమీపంలో ఉన్న పోలిశెట్టి కృష్ణయ్య అనే పాడిరైతు గడ్డివామి సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. రాళ్లచెలిక కాలనీకి చెందిన కృష్ణయ్య గడ్డివామి వేసుకునేందుకు ఇంటి వద్ద వసతి లేకపోవడంతో కలిగిరి రహదారి పక్కన ఏయస్‌పేట దర్గా ఆర్చికి సమీపంలో ఎర్రచెరువు గట్టు మీద సుమారు 10 ఎకరాల ఎండు గడ్డిని వామి వేశాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గడ్డివామికి నిప్పులు అంటుకుని మంటలు వ్యాపించాయి. అటువైపు వెళ్లే ప్రయాణికులు గమనించి ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపు గడ్డివామి మొత్తం దగ్ధమైంది. ఎవరైనా ఆకతాయిలు బహిర్భూమికి వెళ్లి అగ్గిపుల్ల వెలిగించి ఆర్పకుండా పారేయడంతో నిప్పు రాసుకుని గడ్డివామికి మంటలు వ్యాపించాయా, లేక గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టారా అని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈప్రమాదంలో రూ. 50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

వచ్చామా.. వేలిముద్ర వేశామా..వెళ్లిపోయామా !

● ఇదీ బండగానిపల్లి సచివాలయం దుస్థితి



సచివాలయంలో సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఉదయగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సచివాలయ ఉద్యోగులు వచ్చామా.. వేలి ముద్ర వేశమా.. వెళ్లిపోయామా అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. సమావేశాల పేరుతో కొందరు, క్షేత్ర స్థాయిలో ఉన్నామని మరికొందరు చెబుతూ యథేచ్ఛగా విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన అధికారులపై వివాదాలకు దిగుతున్నారు. ఇదీ ఉదయగిరి మండలంలోని బండగానిపల్లి సచివాలయ ఉద్యోగుల పరిస్థితి. సోమవారం సచివాలయంలో పది మంది ఉద్యోగులకు గాను ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉండడంతో పని నిమిత్తం వచ్చిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల నూతన రేషన్‌కార్డుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ప్రజలు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. అయితే ఆ సచివాలయంలో సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండడంలేదని, ఉదయం ఏదో ఒక సమయంలో సచివాలయానికి వచ్చి వేలిముద్ర వేసి కొంతసేపు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారిని సైతం బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా తమ పంథాను కొనసాగిస్తున్నారు. సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అప్పాజీని వివరణ కోరగా విచారించి చర్యలు చేపడతామని తెలిపారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలి

● టీటీడీ చైర్మన్‌కు ఎమ్మెల్యే కాకర్ల ఆహ్వానం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని సోమవారం హైదరాబాదులోని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు క్యాంపు కార్యాలయంలో ఆలయ ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఎమ్మెల్యే చైర్మన్‌కు వివరించారు. దీంతో ఆయన 18వ తేదీన బ్రహ్మోత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుంటానని, అలాగే వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి అన్నివిధాల సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యానాయుడు, మాదాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ శ్రీరాములు అన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఎస్ఆర్ కాలేజీలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రైవేట్ స్కూల్స్ వాహనాల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు మత్తుపానీయాలు సేవించకూడదన్నారు. విద్యార్థులను బస్సులోని బ్యానెట్‌పై కూర్చోబెట్టుకుని వారితో మాట్లాడుతుండడంతో డ్రైవింగ్‌పై ఏకాగ్రత కొరవడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులు నిబంధనలను పాటించాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఏటా భద్రతా వారోత్సవాలను యజ్ఞంలా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఉదయగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ప్రశాంత్, సిప్రారాహుల్, సింధూర సూచించారు. సోమవారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యశాలకు వచ్చిన రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది సలహాలు పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచుకుని పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జాతీయ వరి పరిశోధనా సంస్థ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ డీవికె నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కరటంపాడు, చెర్లోయడవల్లి గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని, విచక్షణరహితంగా ఎరువులు వాడకుండా భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. అనంతరం నెల్లూరు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలక్ష్మీ ప్రస్తుత సీజన్‌కు అనువైన వరి రకాలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఐఆర్ఆర్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు లక్ష్మీప్రసన్న, డాక్టర్ విజయ కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఆర్సీ వ్యవసాయ శాఖాధికారి గీతాకుమారి, మండల వ్యవసాయ అధికారి కె కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అరికట్టాలి



ఆర్డీవో పావనికి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్

ఆత్మకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అరికట్టాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ కోరారు. ఈమేరకు ఆయన సోమవారం ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా చేపల చెరువులు ఉన్నాయని, ఈక్రమంలో చేపల మేత కోసం కర్ణాటక, తమిళనాడు నుంచి చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా నిత్యకృత్యమైందని తెలిపారు. చికెన్ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారని, దీనివలన ప్రజలకు క్యాన్సర్, లివర్‌కు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించొద్దు

● బైండోవర్‌ను అతిక్రమిస్తే ఆస్తులు జప్తు చేయండి
● గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ తిపాఠి

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాత నేరస్థులు, రౌడీమూకలు, అనుమానితులు, కేడీలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించవద్దని, బైండోవర్లను అతిక్రమిస్తే జరిమానా కట్టించడం, ఆస్తులు జప్తులు చేయాలని జిల్లా పోలీసు అధికారులకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో ఎస్పీ కృష్ణకాంత్‌తోపాటు ఐజీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించరాదని, మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే ఛేదించాలని ఆదేశించారు. కొత్త న్యాయ చట్టాలపై ప్రతీ ఒక్కరూ పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాత్రిపూట గస్తీలు ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. ఇక జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసు వెనుక ఉన్న మూలాలను తెలుసుకుంటే పురోగతి సాధించగలుగుతారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలు జరిగే సమయం, ప్రాంతాలను విశ్లేషించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్ కేసులు తగ్గించడానికి తీసుకుంటున్న ప్రణాళికలు, ముందస్తు చర్యలను ఎస్పీ ఐజీకి వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

ఆత్మకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మండలంలోని మహిమలూరు గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు (50) శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కంచర్ల వెంకటేశ్వర్లు ప్రతిరోజు గేదెలు మేపుకొనుటకు బొగ్గేరు సమీప ప్రాంతాలకు తోలుకెళతాడు. అదేక్రమంలో శనివారం ఉదయం గేదెలను తోలుకెళ్లాడు. సాయం త్రానికి గేదెలు తిరిగి ఇంటికొచ్చాయి. వెంకటేశ్వర్లు మాత్రం రాత్రి 10 గంటలైనా తిరిగి రాకపోవడంతో గ్రామ సమీప పొలాల వద్ద కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం సాయంత్రం మృతుడి బంధువులకు బొగ్గేరు వద్ద నీటికుంటలో శవమై కనిపించాడు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు.

8 మందిపై అక్రమ కేసు నమోదు

● కోర్టుకు తరలింపు ● రిమాండ్‌ను తిరస్కరించిన జడ్జి
● స్టేషన్ బెయిల్‌పై విడుదల

సంగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన 8 మందిపై పోలీసులు నాన్ బెయిలబుల్ అక్రమ కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరుపరచగా కేసును పరిశీలించిన జడ్జి రిమాండ్‌ను తిరస్కరించి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపమని పోలీసులను ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఓ మహిళ భీమతాటి సుశీలమ్మ అనే మహిళ వద్ద రూ. 3 లక్షలు అప్పు తీసుకుంది. గడువు తీరినా చెల్లించలేదు. చివరకు అప్పు ఎగ్గొట్టే పన్నాగంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సమీప బంధువైన కానిస్టేబుల్ సహకారంతో అప్పు ఇచ్చిన మహిళ మనుషులను తీసుకొచ్చి తనపై దాడి చేశారని వైద్యశాలలో చేరి నాటకమాడింది. స్టేషన్‌లో పనిచేస్తున్న ఆమె సమీప బంధువైన కానిస్టేబుల్ ప్రోద్బలంతో ఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించి విచారించకుండానే భీమతాటి సుశీలమ్మ, భీమతాటి షారు, భీమతాటి పద్మమ్మ, భీమతాటి శ్రీవిద్య, బెల్లంకొండ వరలక్ష్మి, విడవలూరు ప్రసన్న, మీదురి అరుణమ్మ, మోడేగుంట రమణయ్య అనే 8మందిపై నాన్ బెయిలబుల్ అక్రమ కేసు నమోదు చేసి సోమవారం కోవూరు కోర్టుకు హాజరుపరిచారు. కేసును పరిశీలించిన జడ్జి రిమాండ్‌కు తిరస్కరించి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. దీంతో 8 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు.

కారు దగ్ధం : డ్రైవర్ సురక్షితం



కలిగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కావలి-కలిగిరి రహదారిలో పెద్దపాడు గ్రామ సమీపంలో సోమవారం కారు దగ్ధమైన ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. వివరాల మేరకు.. కావలి నుంయి వరికుంటపాడు మండలం గువ్వాడికి శివ అనే వ్యక్తి కారులో వెళుతుండగా పెద్దపాడు వద్ద నిద్రమత్తులో కారు రోడ్డు మార్జిన్ దిగింది. మార్జిన్ దిగడంతో ఒక్కసారిగా కారును రోడ్డుపైకి తిప్పడంతో రోడ్డు అంచులు తగిలి ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న ప్రయాణికులు కారు వద్దకు చేరుకొని కారు అద్దాలు పగులగొట్టి కారు లోపల ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. ఈ ఘటనలో కారు పూర్తిగా కాలిపోగా డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సిల్వర్ దుకాణంపై దాడులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మండపాలవీధిలో గల ఓ సిల్వర్ దుకాణంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. అనధికారంగా బంగారం, వెండి వ్యాపారం జరుగుతున్నాయన్న సమాచారంతో ఈ దాడులు చేశారు. బెంగళూరులో ఓ నగల దుకాణదారుడికి నెల్లూరులోని దుకాణదారుడికి మధ్య 14కేజీల బంగారం లావాదేవీలకు సంబంధించి వివరాలు నిగ్గుతేల్చేందుకు కర్నాటక డీఆర్‌ఐ అధికారులు, నెల్లూరు డీఆర్‌ఐ అధికారులతో కలిసి దాడులు చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న భావేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం ఆయన్ను నెల్లూరులోని డీఆర్‌ఐ కార్యాలయానికి తీసుకెళ్లారు. అధికారులు దాడి చేసిన దుకాణంలో కొన్నేళ్లుగా వెండి వస్తువులు విక్రయాలు చేస్తున్నారని, అయితే వారు బంగారం వ్యాపారం చేస్తున్నట్లు తమకు తెలియదని వ్యాపారులు చర్చించుకుంటున్నారు. డీఆర్‌ఐ అధికారులు రావడంతో పలువురు తమ దుకాణాలను మూసివేశారు.

నేడు మైపాడులో యోగాంధ్ర కార్యక్రమం

ఇందుకూరుపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు బీచ్‌లో మంగళవారం ఉదయం 7గంటలకు యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందని టీడీపీ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9315
వెండి కిలో ధర	రూ. 100600
వెండి ఒక గ్రాము	రూ. 103.60



రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు

విడవలూరు తహసీల్దారు చంద్రశేఖర్

విడవలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల్లోనే లబ్ధిదారులు తమకు ఇష్టమైన సమయంలో తీసుకోవచ్చు. సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని విడవలూరు తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు.

? మండలంలో ఎన్ని దుకాణాల్లో రేషన్ సరుకులు ఇస్తున్నారు.

! మండలంలో 33 రేషన్ షాపుల ద్వారా సుమారు 15వేల మంది లబ్ధిదారులకు సరుకులను అందజేస్తున్నాము.

? రేషన్ సరుకుల పంపిణీలో అవినీతి జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు.

! పేదలకు సరుకుల అందజేతలో అక్ర మాలు జరగకుండా ప్రతి వారం డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తాం. రేషన్ దుకా ణాల్లో తనిఖీలు చేపడతాం.

? నీటి తీరువా వసూళ్ల మందకొడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

! నీటితీరువా పన్నుల వసూళ్ల వేగవంతం చేశాం. ప్రతిరోజు నీటి తీరువా పన్ను వసూళ్లపై వీఆర్వోలతో మాట్లాడుతున్నాను.

ఇనమడుగు ఆరోగ్య కేంద్రం పరిశీలన

కోవూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి సోమవారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది పనితీరును, వసతులు, సమస్యలను పరిశీలించి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సునీల్‌రెడ్డి, పోలిశెట్టి శ్రీనివాసులు, రవి, నాగేశ్వరరావు, రామచంద్రారెడ్డి, రవిరెడ్డి తదితరులున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం,జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి, కాగులపాడు, సాల్మానుపురం గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యులు సురమౌళి, వెంకటేశ్వర్లు, మోహన్, అన్నపూర్ణ, రిషిత, లీలావతి, శ్రావణి, కృష్ణ, గుప్తరాజు, తదితరులు పాల్గొన్నారు.

కండలేరు నీటి మట్టం 40.089 టీఎంసీలు

రాపూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 40.089 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2460 క్యూసెక్కులు, లోలెవల్ సూయిస్ నుంచి 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 20 క్యూసెక్కులు మొత్తం 2540 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఏఈ తెలిపారు.



షిరిడీలో మనుబోలు చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

మనుబోలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లికి చెందిన పొట్టేళ్ల మస్తాన్ కుమార్తెలు హన్షిత, హన్విత గతనెల 29వ తేదీన కళాక్షేత్రం తరపున షిరిడీలోని సాయిబాబా మందిరంలో ప్రదర్శన ఇచ్చారు. దీంతో దేవస్థానం కమిటీ వారికి జ్ఞాపికను ఇచ్చి ప్రశంసించారు. వీటిని గురువు డేగల సాంబశివరావు చిన్నారులకు అందించారు. ఏడేళ్ల ప్రాయంలోనే కూచిపూడి నృత్యంలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్ళను సోమవారం మండలంలో పలువురు అభినందించారు.

విద్యార్థులూ రండి..

వసతి గృహాల్లో చేరుదాం!



నూతన హంగులతో పొదలకూరు బీసీ బాలికల హాస్టల్

పొదలకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. పాఠశాలలతోపాటు హాస్టళ్లు కూడా ఈనెల 12 నుంచి తెరుచుకోనున్నాయి. వసతి గృహాలు గతం కంటే మెరుగ్గా తయారవుతున్నాయి. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన భవనాలకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయిస్తోంది. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఇప్పటికే పనులు పూర్తిచేశారు. ఒక్కో గృహంలో 100 మంది విద్యార్థులుండాలి. మండలంలో అయితే రెండు చోట్ల సగం మందికి పరిమితమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం కాస్మోటిక్స్ చార్జీలు సకాలంలో ఇవ్వకపోవడం, మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో సంక్షేమాధికారులతోపాటు విద్యార్థులు కూడా ఇబ్బందులుపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ సక్రమంగా చెల్లిస్తోంది. దీంతో ఇబ్బందులు తప్పాయి.


ఎస్సీ బాలికల హాస్టల్‌కు నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ

దరఖాస్తుల స్వీకరణ

పొదలకూరు పట్టణంలో బీసీ సంక్షేమ శాఖకు చెందిన ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఒకటి, పోస్టు మెట్రిక్ ఒకటి ఉన్నాయి. ప్రీ మెట్రిక్ వసతి గృహంలో 70 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఐటీఐ, ఇంటర్, డిగ్రీ కోర్సులు చదువుతున్న వారు చేరుతున్నారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఎస్సీ బాలుర హాస్టల్, ఎస్సీ బాలికా హాస్టల్ ఒకటి పొదలకూరులో ఉన్నాయి. వీటిలో ఒక్కో హాస్టల్‌లో 100 సీట్లు ఉన్నాయి. అలాగే మండలంలోని మహమ్మదాపురంలో ఒక ఎస్సీ బాలుర హాస్టల్, రెండు బీసీ బాలుర హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో మరో 150 సీట్లు వరకు అందుబాటులో ఉన్నాయి. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్లు నింపడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయా హాస్టల్ వార్డెన్లు తెలిపారు.

ఇంటి స్థలం కబ్జాపై చర్యలు తీసుకోండి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ వడ్డిపాళెంకు చెందిన పక్షవాతంతో బాధపడుతున్న నిరుపేద దళిత మహిళ కాగొల్లు బుజ్జమ్మకు చెందిన ఇంటి స్థలాన్ని పలువురు కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకుని ఆ స్థలాన్ని విడిపించి న్యాయం చేయాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా నరసింహులు కోరారు. ఈ మేరకు సోమవారం బాధిత మహిళతో కలసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2008లో అప్పటి ప్రభుత్వం బుజ్జమ్మకు ఇంటి స్థలం మంజూరు చేయగా ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టి బేస్‌మట్టాల వరకు నిర్మించిందన్నారు. ఇంతలో ఆ మహిళ పక్షవాతం వ్యాధికి గురవ డంతో ఇంటి నిర్మాణం బేసుమట్టాలకే పరిమితమైంది. ఆ స్థలంపై కన్నేసిన పలువురు కబ్జా చేసి బాధిత మహిళపైనే పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారని తెలిపారు. స్పందించిన తహసీల్దారు వారంలో పై సమస్యను పరిష్కరిస్తాని హామీ ఇచ్చారు.


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బుజ్జమ్మ

శోభాయాత్రను జయప్రదం చేయండి

● హిందూ చైతన్య వేదిక

పొదలకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 8వ తేదీ సాయంత్రం జరిగే శ్రీహనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని హిందూ చైతన్య వేదిక నిర్వాహకులు చత్రపతి మస్తాన్‌బాబు కోరారు. ఈసందర్భంగా వినాయక స్వామి దేవస్థానం, వీర అభయాంజనేయస్వామి వారి దేవస్థానంలో శోభాయాత్ర కరపత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చొప్పా వెంకటేశ్వర్లు, కండే వాసు, సురేష్, కామేష్, గురుస్వామి, సుబ్రహ్మణ్యం, కుమార్, వెంకటేశ్వర్లు, శోభాయాత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైతన్య వేదిక సభ్యులు

రేషన్ దుకాణం బహుదూరం

● లబ్ధిదారుల అవస్థలు

రాపూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూమాయి గ్రామంలో రేషన్ దుకాణాలు చాలా దూరంలో ఉండడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. తూమాయితో పాటు రేగడిపల్లి అరుంధతి వాడలో సుమారు 200 పైగానే కుటుంబాలు ఉన్నాయి. వీరు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాపూరు రోడ్డులోని హరిజనవాడలో దుకాణం నుంచి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది. మండల రెవెన్యూ అధికారులు స్పందించి హరిజనవాడలో 8 రోజులు, తూమాయి గ్రామంలో మిగిలిన రోజులు రేషన్ సరుకులు పంపిణీ చేస్తే సౌకర్యంగా ఉంటుందని తూమాయి ప్రజలు పేర్కొంటున్నారు.

'108'కి సుస్తీ : సిబ్బంది కుస్తీ

కలిగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న '108' వాహనానికి సుస్తీ చే సింది. దీంతో వాహనం స్టార్ట్ కాకపోవడంతో సిబ్బంది సోమవారం ప్రధాన రహదారిపై వాహనాన్ని నెడుతూ కుస్తీ పట్టడం కనిపించింది. కాలం చెల్లిన వాహ నం కావడం, బ్యాటరీ పనిచేయకపోవడంతో వాహనం తరుచూ మొరాయిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఆపద కాలంలో అత్యవసరంగా సేవలందించే వాహనం పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



వాహనాన్ని నెడుతున్న 108 సిబ్బంది


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవళ్లిక, వైద్యసిబ్బంది

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు గ్రామంలో సోమవారం కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ప్రవళిక ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

● అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఖాదర్‌వలి

మనుబోలు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని, ఇందుకోసం చేపట్టిన వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ఖాదర్‌వల్లీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యసిబ్బందితో మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబి ముక్తిభారత్ అభియాన్ కింద వంద రోజుల ప్రణాళికలో ఇంటింటాసర్వే చేసి క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించి మందుల పంపిణీ, వైద్యసేవలు అందించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తప్పనిసరిగా ఇందులో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి రాజయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

శ్మశానానికి దారి ఏర్పాటుపై దళితుల హర్షం

తోటపల్లిగూడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కొత్తపాలెం దళితవాడలో శ్మశానానికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేయించడంతో దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లిగూడూరు మండలం కొత్తపాలెం గ్రామ దళితవాడకు గత కొన్ని సంవత్సరాల నుంచి శ్మశానానికి దారి లేక అవస్థలు పడుతున్నారు. వైసీపీ నాయకుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. కాగా, గత ఎన్నికల ప్రచారంలో చంద్రమోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే దారి ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం రూ.15లక్షలతో శ్మశానానికి దారి ఏర్పాటుచేసి సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు కృషిచేసిన సర్పంచ్ చేవూరు పద్మావతి, మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు, ఉప సర్పంచ్ శ్రీరామ్ శ్రీహరికి దళిత కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

పర్వతారోహకుడికి అవార్డు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుబల్లి గ్రామానికి చెందిన పర్వతారోహకుడు కోరికల వెంకట సూర్యప్రకాష్‌కు నేపాల్ ప్రభుత్వం అవార్డు అందజేసింది. ఆ దేశంలో ఇటీవల జరిగిన ఎవరెస్ట్ సమ్ మీటర్స్ కార్యక్రమంలో రక్షణ, టూరిజం శాఖ మంత్రి బద్రి ప్రసాద్ పాండే నుంచి సూర్యప్రకాష్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను గ్రామస్థులు అభినందనలతో ముంచెత్తారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ● పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

కొడవలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి మారుపేరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నెల్లూరు ప్లామెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కమ్మపాలెం గ్రామంలో బెల్లం వెంకయ్య నాయుడు, రామన్నపాలెం సర్పంచు కాకి శ్రీనివాసులు, రాచర్లపాడు వైసీపీ నాయకుడు ఆకులరెడ్డి, రెడ్డిపాలెం నాయకుడు నీలకంఠ శ్రీధర్ రెడ్డి, తదితర సుమారు 1500 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వేమిరెడ్డి దంపతులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పాత, కొత్త నాయకుల మధ్య ఏమైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ అవినీతి రహిత నియోజకవర్గ స్థాపన తన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ విధివిధానాలకు ఆకర్షితులై వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య నాయకులు వారధిలా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నాయకులకు తాను అండగా ఉంటానని తెలిపారు. తన ఎన్నికల నినాదమైన అవినీతి రహిత కోవూరుకు నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. సహజ వనరులు, ఇఫ్కో అదాని వంటి పారిశ్రామిక సంస్థలున్న మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీఎస్ శేఖర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, ఎన్.వెంకటేశ్వర్లునాయుడు, జొన్న శివకుమార్, పాశం శ్రీహరిరెడ్డి, పూండ్ల అచ్చుత్‌రెడ్డి, చెక్క మదన్, కరకటి మల్లికార్జున, కేతూ వెంకటరమణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వేమిరెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వెంకయ్య నాయుడు, తదితరులు

● **యోగాంధ్రలో పాల్గొనండి**

కోవూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : నియోజవర్గంలోని ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్‌కు సమీపంలో ఉన్న బకింగ్ హామ్ కెనాల్ పక్కన మంగళవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అక్కడికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు వారి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేయాలని పేర్కొన్నారు.

● **విద్యార్థినికి సాయం**

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2(ఆంధ్రజ్యోతి): కనుపర్తిపాడుకు చెందిన విద్యార్థిని గాయత్రి ఇంటర్ చదువుకోడానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం తన నివాసంలో రూ.50 వేల చెక్కును అందచేశారు. గాయత్రి వీపీఆర్ విద్య సంస్థలో పదవ తరగతి చదివి 587 మార్కులు సాధించారు. ఇంటర్ చదువుకోడానికి ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ. 50వేల ఆర్థిక సహాయం అందచేశారు.

C.R.I.M.E N.E.W.S

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించొద్దు

● బైండోవర్‌ను అతిక్రమిస్తే ఆస్తులు జప్తులు చేయండి

● గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ తిపాఠి

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాత నేరస్థులు, రౌడీమూకలు, అనుమానితులు, కేడీలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించవద్దని, బైండోవర్లను అతిక్రమిస్తే జరిమానా కట్టించడం, ఆస్తులు జప్తులు చేయాలని జిల్లా పోలీసు అధికారులకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో ఎస్పీ కృష్ణకాంత్‌తోపాటు ఐజీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించరాదని, మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే ఛేదించాలని ఆదేశించారు. కొత్త న్యాయ చట్టాలపై ప్రతీ ఒక్కరూ పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాత్రిపూట గస్తీలు ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. ఇక జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసు వెనుక ఉన్న మూలాలను తెలుసుకుంటే పురోగతి సాధించగలుగుతారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలు జరిగే సమయం, ప్రాంతాలను విశ్లేషించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్ కేసులు తగ్గించడానికి తీసుకుంటున్న ప్రణాళికలు, ముందస్తు చర్యలను ఎస్పీ ఐజీకి వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

ఆత్మకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మండలంలోని మహిమలూరు గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు (50) శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కంచర్ల వెంకటేశ్వర్లు ప్రతిరోజు గేదెలు మేపుకొనుటకు బొగ్గేరు సమీప ప్రాంతాలకు తోలుకెళతాడు. అదేక్రమంలో శనివారం ఉదయం గేదెలను తోలుకెళ్లాడు. సాయం త్రానికి గేదెలు తిరిగి ఇంటికొచ్చాయి. వెంకటేశ్వర్లు మాత్రం రాత్రి 10 గంటలైనా తిరిగి రాకపోవడంతో గ్రామ సమీప పొలాల వద్ద కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం సాయంత్రం మృతుడి బంధువులకు బొగ్గేరు వద్ద నీటికుంటలో శవమై కనిపించాడు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు.

8 మందిపై అక్రమ కేసు నమోదు

● కోర్టుకు తరలింపు ● రిమాండ్‌ను తిరస్కరించిన జడ్జి

● స్టేషన్ బెయిల్‌పై విడుదల

సంగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన 8 మందిపై పోలీసులు నాన్ బెయిలబుల్ అక్రమ కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరుపరచగా కేసును పరిశీలించిన జడ్జి రిమాండ్‌ను తిరస్కరించి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపమని పోలీసులను ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఓ మహిళ భీమతాటి సుశీలమ్మ అనే మహిళ వద్ద రూ. 3 లక్షలు అప్పు తీసుకుంది. గడువు తీరినా చెల్లించలేదు. చివరకు అప్పు ఎగ్గొట్టే పన్నాగంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సమీప బంధువైన కానిస్టేబుల్ సహకారంతో అప్పు ఇచ్చిన మహిళ మనుషులను తీసుకొచ్చి తనపై దాడి చేశారని వైద్యశాలలో చేరి నాటకమాడింది. స్టేషన్‌లో పనిచేస్తున్న ఆమె సమీప బంధువైన కానిస్టేబుల్ ప్రోద్బలంతో ఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించి విచారించకుండానే భీమతాటి సుశీలమ్మ, భీమతాటి షారు, భీమతాటి పద్మమ్మ, భీమతాటి శ్రీవిద్య, బెల్లంకొండ వరలక్ష్మి, విడవలూరు ప్రసన్న, మీదురి అరుణమ్మ, మోడేగుంట రమణయ్య అనే 8మందిపై నాన్ బెయిలబుల్ అక్రమ కేసు నమోదు చేసి సోమవారం కోవూరు కోర్టుకు హాజరుపరిచారు. కేసును పరిశీలించిన జడ్జి రిమాండ్‌కు తిరస్కరించి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. దీంతో 8 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు.

కారు దగ్ధం : డ్రైవర్ సురక్షితం



కలిగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కావలి-కలిగిరి రహదారిలో పెద్దపాడు గ్రామ సమీపంలో సోమవారం కారు దగ్ధమైన ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. వివరాల మేరకు.. కావలి నుంయి వరికుంటపాడు మండలం గువ్వాడికి శివ అనే వ్యక్తి కారులో వెళుతుండగా పెద్దపాడు వద్ద నిద్రమత్తులో కారు రోడ్డు మార్జిన్ దిగింది. మార్జిన్ దిగడంతో ఒక్కసారిగా కారును రోడ్డుపైకి తిప్పడంతో రోడ్డు అంచులు తగిలి ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న ప్రయాణికులు కారు వద్దకు చేరుకొని కారు అద్దాలు పగులగొట్టి కారు లోపల ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. ఈ ఘటనలో కారు పూర్తిగా కాలిపోగా డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సిల్వర్ దుకాణంపై దాడులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మండపాలవీధిలో గల ఓ సిల్వర్ దుకాణంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. అనధికారంగా బంగారం, వెండి వ్యాపారం జరుగుతున్నాయన్న సమాచారంతో ఈ దాడులు చేశారు. బెంగళూరులో ఓ నగల దుకాణదారుడికి నెల్లూరులోని దుకాణదారుడికి మధ్య 14కేజీల బంగారం లావాదేవీలకు సంబంధించి వివరాలు నిగ్గుతేల్చేందుకు కర్నాటక డీఆర్ఐ అధికారులు, నెల్లూరు డీఆర్ఐ అధికారులతో కలిసి దాడులు చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న భావేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం ఆయన్ను నెల్లూరులోని డీఆర్ఐ కార్యాలయానికి తీసుకెళ్లారు. అధికారులు దాడి చేసిన దుకాణంలో కొన్నేళ్లుగా వెండి వస్తువులు విక్రయాలు చేస్తున్నారని, అయితే వారు బంగారం వ్యాపారం చేస్తున్నట్లు తమకు తెలియదని వ్యాపారులు చర్చించుకుంటున్నారు. డీఆర్ఐ అధికారులు రావడంతో పలువురు తమ దుకాణాలను మూసివేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 525

గ్లోబల్ క్వీన్ ఇండియా విన్నర్‌కి సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన మిస్టీన్ సూపర్ గ్లోబ్ క్వీన్ ఇండియా పోటీల్లో విన్నర్‌గా నిలచిన నగరానికి చెందిన సయ్యద్ అన్సారీకి నగర ప్రముఖులు ఘన సన్మానం చేశారు. నగరంలోని ఓ హోటల్ సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్, 42వ డివిజన్ కార్పొరేటర్ షేక్.కరిముల్లా, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, పాల్గొని, ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు.

క్వీన్ ఇండియా పోటీల విన్నర్ సయ్యద్ అన్సారీని సత్కరిస్తున్న ప్రముఖులు



రేపు ఎస్పీ బాలు జయంతి

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని నగరంలోని పురమందిరంలో బుధవారం నిర్వహించ నున్నట్లు చేతన సాహిత్య, సంగీత, సాంస్కృతిక వేదిక కార్యదర్శి వై.శేషగిరీశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సినీనటుడు శుభలేఖ సుధాకర్, సినీగాయని ఎస్పీ శైలజ, బాలు కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీగాయకురాలు బీ.రమణకు మధుర గాయని బిరుదుతోపాటు ఎస్పీ బాలు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో బాలు సినీచిత్ర గీతావళి కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు సందర్భంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రకృతిపై చిత్రాలు వేసి, రంగులు దిద్ది ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, రిసోర్సు పర్సన్లు సతీష్ కుమార్, సిబ్బంది, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు గాయాలు



గాయాలపాలైన మహిళను పరామర్శిస్తున్న నుడా ఛైర్మన్

నెల్లూరు(క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు, అరవిందనగర్‌కు చెందిన షబానా చిల్డ్రన్‌పార్క్ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొని పరారైంది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. ఆ మార్గం గుండా వెళుతున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గాయాలపాలైన ఆ మహిళను గమనించి తన కారులో అపోలో వైద్యశాలకు తరలించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలి

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని సోమవారం హైదరాబాదులోని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు క్యాంపు కార్యాలయంలో ఆలయ ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 15 నుంచి 19 వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఎమ్మెల్యే వివరించారు. 18న బ్రహ్మోత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుంటానని, వెంగమాంబ ఆలయ అభివృద్ధికి అన్నివిధాల సహకరిస్తానని ఛైర్మన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యానాయుడు, మాదాల బాబురావు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

● రూ. 50 వేల నష్టం

సంగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సంగం - కలిగిరి రహదారి పక్కన ఆర్చికి సమీపంలో ఉన్న పోలిశెట్టి కృష్ణయ్య అనే పాడి రైతు గడ్డివామి సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. రాళ్లచెలిక కాలనీకి చెందిన కృష్ణయ్యకు పాడి పశువులు ఉన్నాయి. గడ్డివామి వేసుకునేందుకు ఇంటి వద్ద వసతి లేకపోవడంతో కలిగిరి రహదారి పక్కన ఏయస్‌పేట దర్గా ఆర్చికి సమీపంలో ఎర్రచెరువు గట్టు మీద సుమారు 10 ఎకరాల ఎండు గడ్డిని వామి వేశాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గడ్డివామికి నిప్పులు అంటుకుని మంటలు వ్యాపించాయి. అటువైపు వెళ్లే ప్రయాణికులు గమనించి ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపు గడ్డివామి మొత్తం దగ్ధమైంది. ఎవరైనా ఆకతాయిలు బహిర్భూమికి వెళ్లి అగ్గిపుల్ల వెలిగించి ఆర్పకుండా పారేయడంతో నిప్పు రాసుకుని గడ్డివామికి మంటలు వ్యాపించాయా, లేక గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టారా అని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈప్రమాదంలో సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

సోమశిలలో 41.923 టీఎంసీల నీరు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 41.923 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కి 52 వినతులు



పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న అధికారులు

నెల్లూరు(సిటీ),జూన్2,(ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 52 వినతులు అందాయి. హౌసింగ్, సిటీప్లానింగ్, రెవెన్యూతోపాటు ఇతర శాఖల సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులు అందచేశారు. వచ్చిన అర్జీలను సమగ్రంగా విచారించి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ వైవో నందన్ అధికారులను ఆదేశించారు. ముందుగా గాంధీబొమ్మ, ట్రంకురోడ్డు, రంగనాయకులపేట, కుక్కలగుంట, పరమేశ్వరీనగర్, వాకర్స్‌రోడ్డు ప్రాంతాల్లో ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు.

క్షయ వ్యాధిని నివారించాలి : డీఎంహెచ్‌వో



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత తదితరులు

నెల్లూరు (వైద్యం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధిని నివారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. సోమవారం నగరంలోని చాకలివీధి సీహెచ్‌సీలో ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయినింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో షుగర్ వ్యాధిగ్రస్థులు, ఆల్కాహాలు, పొగ తాగేవారు, పొగాకు ఉత్పత్తులు వాడే వారు తప్పనిసరిగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించు కోవాలన్నారు. అలాగే 60 ఏళ్లు పైబడిన వారు బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారు, గత ఐదేళ్లలో క్షయ వ్యాధివచ్చిన వారు, కుటుంబ సభ్యులు కూడా తప్పని సరిగా పరీక్షలు చేయించు కోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలియచేశారు. అనంతరం క్షయ క్యాంపెయినింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, వైద్యాధికారి డాక్టర్ గీతాంజలి, సీఈవో తిరపతయ్య, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ విజయకుమార్, శ్రావణ్‌కుమార్, హరీష్, మధు, రాజేంద్రకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ ఆస్తుల లీజుపై విచారణ నిర్వహించాలి



ఆశ్రమ ఆస్తులపై విచారణకు డిమాండ్ చేస్తున్న భక్తులు, స్థానికులు

నెల్లూరు (సాంస్కృతికం)జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఐదో డివిజన్ సత్యనారాయణపురంలోని శ్రీభరద్వాజ ఆశ్రమ భూములు, లీజు అక్రమ వ్యవహారాలపై విచారణ జరపాలని స్థానికులు ఎస్.రాజగోపాల్‌రెడ్డి, వై.శ్రీనివాసులు, వై.లక్ష్మీకాంతమ్మ, జీ.రామకృష్ణ, తదితరులు దేవదాయశాఖ మంత్రి, అధికారులను కోరారు. సోమవారం వారు ఆశ్రమం వద్ద విలేకరులతో మాట్లాడారు. గంగాధరానంద స్వామి 1987లో ఆశ్రమం ఏర్పాటు చేశారని, దాతలు, భక్తుల సహకారంతో శ్రీకృష్ణమందిరం, ఉమామహేశ్వరాలయం, ఆశ్రమ భవనం, రూములు నిర్మించారని తెలిపారు. 1993 నుంచి ఇక్కడ ఉత్సవాలు, పూజలను తాము నిర్వహిస్తున్నామని తెలిపారు. గంగాధరానందస్వామి కరోనా సమయంలో మృతి చెందారని తెలిపారు. కాగా 2025 మే7న పొద్దుటూరు శ్రీకృష్ణగీతా ఆశ్రమం నిర్వాహకులు కే. రామ చంద్రాచార్యులు భక్తులకు తెలియకుండా ఓ ప్రైవేటు స్కూలు లీజుకు ఇచ్చినట్లు అగ్రిమెంటు చేయించుకున్నారని వివరించారు. ఈ వ్యవహారాన్ని గోప్యంగా నిర్వహించడంపై తమకు అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వం విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఉదయగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ప్రశాంత్, సిప్రారాహుల్, సింధూర సూచించారు. సోమవారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యశాలకు వచ్చిన రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడే ఇలా.. వర్షాలు వస్తే ఎలా?

● పూడికతీతకు నోచుకోక దుస్థితిలో పంట కాలువలు



టీవీ స్టేషన్ వద్ద కంపచెట్లు, గడ్డితో నిండి పోయిన తాళ్లపాలెం చెరువు వరవ కాలువ

కావలి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం, మండలంలో సాగు నీటి కాలువలు పూడికతీతకు నోచుకోక దుస్థితిలో ఉన్నాయి. వాటి రూపురేఖలు మారిపోయి ఉన్న ఈ కాలువలు ఇప్పుడే ఇలా .. వర్షాలు వస్తే ఎలా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోతే రానున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పట్టణ వాసులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నుంచి సాగు నీటిని సరఫరా చేసే కాలువలు పూడిక, గడ్డితో నిండిపోయి మురుగు నీటి కాలువలుగా మారిపోయాయి. పట్టణం లోని పాతూరు నుంచి వెంగయ్యగారిపాలెం లోని కావలమ్మ గుంటకు నీటిని సరఫరా చేసే సాగు నీటి కాలువలు మురుగు నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రానున్న వర్షాలకు ఈ కాలువ గుండా నీటి సరఫరా సాగేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కావలి చెరువు నుంచి పాతూరు గుండా తాళ్లపాలెం జూటూరు చెరువుకు సాగునీటి సరఫరా జరిగే వరవ కాలువకు ఇటీవల పూడికతీత చేపట్టినప్పటికీ పాతూరు లోని వెంగయ్యగారిపాలెం రోడ్డులో కాలువ మొత్తం గడ్డి, పూడికతో నిండిపోయింది. వర్షాలకు పట్టణంలోని వర్షపు నీరు మొత్తం ఈ కాలువల గుండానే చెరువులకు చేరాల్సి ఉండగా పూడిపోయిన కాలువలతో పట్టణ వాసులకు వర్షపు నీటితో ముప్పుతప్పదు. అధికారులు పాలకులు స్పందించి రానున్న వర్షాలకు ముందస్తుగా పట్టణం లోని వరవ కాలువలు, సాగు నీటి సరఫరా కాలువలకు పూడికతీత పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



వెంగయ్యగారిపాలెంలో గడ్డితో నిండిన ప్రధాన పంట కాలువ

రెచ్చిపోతున్న మందుబాబులు

ఆత్మకూరు బస్టాండు పక్కనే రెండు మద్యం దుకాణాలు ● బస్సులు మలుపు తిరిగే వద్ద తాగి తూలుతూ..

● షడన్ బ్రేకులు వేస్తున్న డ్రైవర్లు ● ఒంటరిగా కన్పిస్తే బెదిరించి దోపిడీ ● భయాందోళనలో ప్రయాణికులు

నెల్లూరు(క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆత్మకూరు బస్టాండులో మందుబాబుల ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ప్రతినిత్యం వేలాదిమంది ప్రజలు ప్రయాణాలు చేసేందుకు ఇక్కడికి వస్తుంటారు. అయితే బస్టాండ్‌కు పది అడుగుల దూరంలో రెండు మద్యందుకాణాలు ఏర్పాటు చేయడంతో మందుబాబులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మందుబాబులు చేస్తున్న సైగలు, వెకిలి చేష్టలను ఎవరికీ చెప్పుకోలేక మహిళలు లోలోన కుమిలి పోతున్నారు.

● పొంచి ఉన్న ప్రమాదం

బస్టాండు లోపలికి బస్సులు పూల మార్కెట్ పక్కన సందులో నంచి మలుపు తిరుగుతాయి. అక్కడే రెండు మద్యం దుకాణాలు ఉండటంతో మందుబాబులు పూటుగా మద్యం తాగి మలుపుల వద్ద తూలుతూ బస్సులకు అడ్డంగా వస్తున్నారు. దీంతో డ్రైవర్లు షడన్ బ్రేక్ వేయాల్సి వస్తున్నది. దీంతో ఈ ప్రాంతంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు.



ఆత్మకూరు బస్టాండు పక్కనే ఉన్న రెండు మద్యం దుకాణాలు

● రోడ్డు పక్కనే మద్యం సేవిస్తూ...

మందుబాబులు రోడ్డుపైనే బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. మత్తులో ఒకరిపై ఒకరు పడుతూ అసభ్యకరంగా బూతులు మాట్లాడుకుంటుంటారు. బిగ్గరగా కేకలు వేస్తున్నారు. దీంతో బస్టాండుల్లోకి వెళ్లే మహిళలు భయంతో పరుగులు తీస్తున్నారు. కొందరు మందుబాబులు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.



రోడ్డు పక్కనే మద్యం సేవిస్తున్న మందుబాబులు

● దాడులకు పాల్పడుతూ..

గతనెలలో చెన్నై నుంచి హైదరాబాద్‌కు రైలులో వెళుతున్న ఓ వ్యక్తి అనారోగ్యంతో నెల్లూరు స్టేషన్‌లో దిగాడు. నేరుగా ఆత్మకూరు బస్టాండు సమీపంలోని మెడికల్ షాపులో మందులు కొన్ని చెన్నైకి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో మందుబాబులు బీరు బాటిళ్లతో అతనిపై దాడి చేసి, నగదు దోచుకెళ్లారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా పోలీసుల దృష్టికి వెళుతున్నవి మాత్రం ఒక్కటో రెండో ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, పోలీసులు మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాలి.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకర్లను అభినందిస్తున్న నారాయణ విద్యా సంస్థ ప్రతినిధులు



విద్యార్థులను అభినందిస్తున్న రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్

నెల్లూరు (విద్య), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభకనబరిచారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వీ. విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థలకు చెందిన మధు కిరణ్ 113, పూర్వజ్ 332, సంతోష్ 1361, భాను రిషిక్ 1563, అఖిలేష్ 2323, యశ్వంత్‌బాబి 24 81, సాయిసాత్విక్ 2517, ఆశిత 2758, హర్షవర్ధన్‌రెడ్డి 2760, శశిజ్ఞాన కౌషిక్‌రెడ్డి 3129, హితేష్ అభిషేక్ 3292, భానుసుజిత్ 3446, మేఘన 3756 ర్యాంకును సాధించారన్నారు. అలాగే ఓ పెన్ కేటగిరిలో 150లోపు ఒకరు, 2వేల లోపు నలుగురు, 3వేల లోపు 9 మంది, 5వేల లోపు 14 మంది, 10వేల లోపు 25 మంది, 20 వేలలోపు 56 మంది ర్యాంకులు సొంతం చేసుకున్నారని వివరించారు. మొత్తం మీద అడ్వాన్స్‌డ్‌లో 130 మంది అర్హత సాధించారని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

● విశ్వసాయి విజయం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. నగరంలోని మాగుంటలేఅవుట్‌లో ఉన్న జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు సీహెచ్.సాయిరూపేష్ 2298, జి.కైలాష్‌రెడ్డి 3391, యు.కుష్వంత్ కుమార్ 107 98 ర్యాంకులను సాధించారన్నారు. ఉత్తమ విద్యాబోధనతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

● రత్నం విద్యార్థుల ప్రభంజనం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. నగరంలోని కళాశాలలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు పి.సాయివర్షిల్‌రెడ్డి, ఎస్.తిలక్‌వర్మ, జె.ప్రశాంత్, కె.నిహారిక, వై.తినేష్, పి.మహీధర్, ఎం.త్రిషాంత్, ఎం.తేజోను, ఎ.యోగేష్‌లు ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్ లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతికిషోర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ నరసయ్యనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఓవెల్‌కు ఉత్తమ ఫలితాలు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓవెల్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఎండీ ఆర్.వేణు తెలిపారు. నగరంలోని కళాశాలలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు ఎంవిఎస్.హేమంత్ 890, బి.బాలసుబ్రహ్మణ్యం 2164, ఎం.మోహన ప్రియ 2384, ఆర్.యశ్వంత్ 2673, వి.బాలహర్షిత 5111, ఎం.చరణ్‌తేజ్‌రెడ్డి 5145, ఎస్.డి.అఫ్జల్ షరీష్ 5457, వై.వెంకటచరణ్‌తేజ 6333, ఎ. దుర్గ హనుమంత్‌ప్రసాద్ 7263, ఇ.కృష్ణవంశీ 9476 ర్యాంకులను సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్, ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి విద్య, ఐఐటీ లెక్చరర్స్ పి.సుధీర్, పి.రాము, పి.రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతారహితంగా రహదారుల పనులు

● ఐదేళ్లకే గుంతలమయం ● నగరంలో సిమెంట్ల రోడ్ల దుస్థితి



పూర్తిగా కుంగిన జగదీష్‌నగర్ రోడ్డు



ప్యాచ్‌వర్క్ వేసిన తరువాత కూడా గుంతల మయంగా చిల్డ్రన్స్ పార్కు రోడ్డు

నెల్లూరు (జడ్పీ), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వందేళ్లపాటు నాణ్యతగా ఉండాల్సిన సిమెంట్ రోడ్లు, రెండుమూడేళ్లకే అధ్వానంగా మారుతున్నాయి. రోడ్ల నిర్మాణ సమయంలో అధికారులు నాణ్యతను గాలికి వదిలేయడం, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో నగరంలో గతంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు గుంతలమయంగా మారాయి.వాటి మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన ప్యాచ్‌వర్క్‌లు అధ్వానంగా ఉన్నాయి. అయినా ఆ రోడ్లు ఈ దుస్థితికి రావడానికి కారణమేంటన్న ఆలోచనను అటు పాలకులుకానీ, ఇటు అధికారులు కానీ ఆలోచన చేయడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా నాసిరకం సిమెంట్ రోడ్లపై పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

● అభివృద్ధి పనులకు హడ్కో నిధులు

నగరంలో గత టీడీపీ ప్రభుత్వంలో భూగర్భడ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేశారు. హడ్కో నిధులు రూ. 1100కోట్లతో ఈ రెండు భారీ ప్రాజెక్టులను గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని రోడ్లను పగులగొట్టారు. పనులు పూర్తయ్యాయక 2019లో ఎన్నికలకు ముందు పెద్దఎత్తున రోడ్ల నిర్మాణాలకు టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపుగా రూ. 300కోట్లతో నగరంలో 90శాతం రోడ్లను పూర్తిచేసింది. అయితే అందులో కొంతభాగం రోడ్లు, రెండు, మూడేళ్లకే దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు కుంగిపోయాయి. పైపులైన్ల పనుల జరిగిన తరువాత రోడ్లనిర్మాణాల నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, మెయిన్‌రోడ్డుతోపాటు బాలాజీనగర్, ఎన్టీఆర్ నగర్, నవాబుపేట తదితర ప్రాంతాల మెయిన్ రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు, భూమిలోకి కుంగి గుంతలమయంగా మారాయి. అలాగే ఎక్కువ భాగం అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయి. అయితే ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలను గాలికి వదిలేయడంతోపాటు, కనీసం దెబ్బతిన్న రోడ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నగరంలోని రహదారులపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న ఎన్టీఆర్ నగర్ లోని ప్రధాన రోడ్డు



సర్పాల సయ్యాట!

దుత్తలూరు గ్రామంలోని సీతమ్మ బావి సమీపాన ఖాళీ ప్రదేశంలో సోమవారం రెండు సర్పాలు పెనవేసుకుని సయ్యాట సాగించాయి. ఈ దృశ్యాన్ని ప్రజలు తిలకించి, తమ మొబైళ్లలో బంధించారు. సుమారు అర్థగంటపాటు సర్పాలు తమ సయ్యాటను సాగించాయి.

- దుత్తలూరు (ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)

ఏబీసీతో భవిష్యత్తుకు బలమైన బాట : వీసీ

వెంకటాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు ఏబీసీ (అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్) వ్యవస్థ బలమైన బాట వేస్తుందని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. కాకుటూరులో ఆ వర్సిటీ పరిపాలన భవనంలో సోమవారం అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమీక్షలో వీసీ మాట్లాడారు. నూతన విద్యావిధానంలో సింగిల్, డ్యూయల్, మేజర్ ప్రోగ్రాములుగా మార్చడం ద్వారా విద్యార్థులకు రెండు విభిన్న రంగాల్లో నైపుణ్యం పొందే అవకాశాలు కలుగుతాయన్నారు. విద్యావిధానాల అమలులో అనుబంధ కళాశాలల పాత్ర కీలకమనీ, ప్రతి కళాశాల ఈ మార్పులను విజయవంతంగా అమలుచేయడంలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ సమీక్షలో రిజిస్ట్రార్ సునీత, పరీక్షల నియంత్రణ అధికారి మధుమతి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉదయ్‌శంకర్, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు



జనసేన పార్టీ నిధికి రూ.4 లక్షల విరాళం

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నిధికి జిల్లా నాయకులు రూ.4 లక్షల విరాళాన్ని మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబుకు చెక్కు రూపంలో సోమవారం అందించారు. ఆ పార్టీ నేత నూనె మల్లికార్జున యాదవ్ రూ.లక్ష, సర్వేపల్లి నియోజకవర్గ నాయకుడు బోనుబోయిన ప్రసాద్, ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండలం దువ్వూరుకు చెందిన చదలవాడ హరీష్, వెంకటగిరి నాయకులు అనిల్ రామారావులు రూ.3 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో గునుకుల కిషోర్, కాకు మురళీ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవి, జమీర్, గుర్రం కిషోర్ తదితరులున్నారు.

అభాగ్యులం.. ఆదుకోండి!

కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సామాన్యులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఒకటికి రెండుసార్లు వచ్చినా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. కాగా, ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 402 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖవి 169, మున్సిపల్ శాఖవి 38, సర్వేవి 29, పంచాయ తీశాఖకు సంబంధించి 23 అర్జీలు ఉన్నాయి.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీ లకు సత్వర పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి కలెక్ట ర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, అం తర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నె ల 21న మైపాడు బీచ్‌లో యోగాంధ్ర కార్యక్ర మాన్ని నిర్వహిస్తు న్నామని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు.



● మంచినీరు, కరెంటు ఇవ్వండయ్యా

అల్లీపురం టిడ్కో కాలనీ టి.250 బ్లాక్‌కు చెందిన నాగమణి తదితర మహిళలు తమ కాలనీకి మంచి నీటి వసతి కల్పించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించను వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికి ఒక సారి కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చామని అయినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మంచి నీరు, కరెంటు లేకుండా ఎలా జీవించాలంటూ వాపోయారు.

● ఇళ్లు చూపించడయ్యా

రామసుబ్బమ్మ, వేణమ్మది రాపూరు మండలం రామదేవపల్లి. 2014-15 సంవత్సరాల మధ్య రైల్వేలైను కోసం తమ ఇళ్లను తొలగించారని, ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తామని అధికారులు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికి కలెక్టరేట్ చుట్టూ పదిసార్లు తిరిగినా తమ గోడు అధికారులు వినలేదని వాపోయారు. 35 మంది ఇళ్లను కోల్పోయామని, అందరికీ ఇళ్లు కేటాయించాలని కోరారు.





● పింఛను ఇప్పించండి

ఈమె పేరు కె.శాంతమ్మ. నెల్లూరులోని కొండాయపాళెం వాసి. వయసు 80 సంవత్సరాలు. భర్త, పిల్లలు ఎవరూలేని అభాగ్యురాలు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పింఛను ఇచ్చావారని, వైసీపీ వచ్చాక పింఛను ఆపేశారని వాపోయింది. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినందున తనకు పింఛను మంజూరు చేయాలని కోరింది. ఇప్పటికే మూడు సార్లు కలెక్టరేట్‌కు వచ్చానని, అయినా పింఛను మంజూరు చేయలేదని చెప్పింది.

● దివ్యాంగ పింఛను కోసం..

ఈమె పేరు పల్లెపు పిస్తమ్మ, అల్లూరు మండలం నార్త్ అమూలూరు. దివ్యాంగ పింఛను ఇప్పించాలని అల్లూరు మండలంలోని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవటంతో కలెక్టరేట్‌కు వచ్చింది. అయినా పింఛను మంజూరు కాక పోవటంతో రెండోసారి కలెక్టరేట్‌కు వచ్చింది. తన సమస్యను తెలుసుకుని పింఛను మంజూరు చేయాలని పిస్తమ్మ కోరుతోంది.



- నాడు ప్రయాణానికి.. నేడు ఆరోగ్యం మెరుగుదలకు
- నేడు అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం

వన్నె తగ్గని సైకిల్!

రాజుల కాలం నాటి రథాలు పోయాయి. జమీందార్ల జట్కాలు పోయాయి. ఎడ్ల బండ్లు కనుమరుగయ్యాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ శతాబ్దాలు గడుస్తున్నా ఇంధన, ఎలక్ట్రిక్ యుగాలు నడుస్తున్నా.. నాటికి నేటికి అంతే ప్రాధాన్యతతో నిలబడింది సైకిల్. జనజీవనంలో ఇంటింటి నేస్తంగా చెరగని బంధం ఏర్పరుచుకున్న యంత్ర పరికరం సైకిల్. నాలుగైదు దశాబ్దాల క్రితం వరకూ పల్లె నుంచి మరో పల్లెకు వెళ్లాలన్నా, పక్కనున్న పట్టణానికి చేరుకోవాలన్నా ఎడ్ల బండ్లే ప్రధాన ప్రయాణ సాధనం. ఒకరిద్దరు ప్రయాణించాలంటే నడక ఒక్కటే మార్గం. సైకిల్ అందుబాటులోకి రావడంతో జనజీవనంలో ప్రయాణం వేగం పుంజుకుంది. ప్రతి ఇంటికి సైకిల్ ఒక అవసరంగా మారింది. అప్పట్లో 20, 30 కిలోమీటర్ల దూరమైనా ఇద్దరు, ముగ్గురు హాయిగా సైకిల్‌పై ప్రయాణించేవారు. ఆ రోజుల్లో ర్యాలీ సైకిల్ కలిగి ఉండటం అంటే గొప్ప. ఆ తర్వాత హెర్క్యులెస్, అట్లాస్ సైకిళ్లు మార్కెట్‌ను ఏలాయి. సైకిల్ రిపేరు షాపులు కూడా చాలా మందికి జీవనోపాధిగా మారింది.



కాలం మారింది. ప్రయాణంలో వేగం పెరిగింది. పెట్రోలుతో నడిచే మోటార్ బైక్‌లు రంగ ప్రవేశం చేశాయి. విపరీతంగా అప్పులిచ్చే ఫైనాన్స్ సంస్థలు అందుబాటులోకి రావడంతో బైక్‌ల శకం మొదలయ్యింది. అయినా ఇప్పటికీ సైకిల్ వన్నె తగ్గలేదు. పల్లె ప్రాంతాల్లోని విద్యార్థులకు సైకిలే ప్రధాన ప్రయాణ సాధనం. అంతేకాదు పడవల్లాంటి కార్లు కలిగిన సంపన్నులు కూడా ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుతున్నారు.

● ఆరోగ్య సాధనంగా

ప్రయాణ సాధనంగా జనజీవనంలోకి అడుగు పెట్టిన సైకిల్ ఇప్పుడు ఆరోగ్య సాధనంగా మారింది. ప్రతిరోజు సైకిల్ తొక్కడం వల్ల టైప్1, టైప్2 డయాబెటీస్ బాధితుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని అధ్యయనాల్లో గుర్తించారు. అంతేకాదు గుండె జబ్బులు తగ్గిస్తాయని, సైకిల్ తొక్కే అలవాటు కేన్సర్‌ను నియంత్రించే శక్తి శరీరానికి ఇస్తుందని గుర్తించారు. సైకిల్ తొక్కడం వల్ల ఊపిరితిత్తులు బలోపేతం అవుతాయని పరిశోధనల్లో రుజువు చేశారు. ఈ కారణంగానే కరోనా కాలంలో ఊపిరి తిత్తుల బలం పెంచుకోవడం కోసం ఎంతోమంది సైకిల్ తొక్కడం మొదలు పెట్టారు. సైకిల్ వాడకం పెంచాలని, తద్వారా ప్రజారోగ్యం మెరుగు పడటం తోపాటు వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించగలుగుతా మని ప్రపంచ వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. సైకిల్ ప్రాధాన్యతను గుర్తించారు. వాస్తవానికి చరిత్రలో సైకిల్‌కు ఒక గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే ప్రయత్నం 2016లో జరిగింది. 2018లో అంతర్జాతీయ సమితి దానికి ఆమోదించింది. అప్పటి నుంచి జూన్ 3వ తేదీన అంతర్జాతీయ సైకిల్ దినోత్సవంగా ప్రపంచ దేశాలు జరుపుకొంటున్నాయి. జనజీవనానికి ఇంత మేలు చేసే సైకిల్‌ను మనమూ గౌరవిద్దామా! మళ్లీ సైకిల్ ఎక్కుదామా!!

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

నమ్మించి మోసం చేశారు.. న్యాయం చేయండి !

పీజీఆర్ఎస్‌లో ఎస్పీని వేడుకున్న బాధితులు

నెల్లూరు(క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటే నమ్మింది ఓ తల్లి. తన ఇంటిపై రుణం ఇప్పిస్తామంటే నమ్మి రూ. లక్షలు ఇచ్చింది ఓ మహిళ. లండన్‌లో ఉన్న కుమారుడికి డబ్బు పంపమని నమ్మకంగా ఓ వ్యక్తికి ఇచ్చాడు తండ్రి.. కానీ ఆ వ్యక్తి పంపలేదు. ఇలా నమ్మించి మోసం చేశారని, న్యాయం చేయాలని పలువురు బాధితులు ఎస్పీ పీజీఆర్ఎస్‌లో వేడుకున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 104 మంది బాధితులు తమ సమస్యలను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ. కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారుల ను ఆదేశించారు.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

● నగరంలోని వేదాయపాలెం ప్రాంతానికి ఓ మహిళ తన కుమారుడికి ఉద్యోగం కోసం నగరంలోని పోలీసుకాలనీకి చెందిన శివయ్యను సంప్రదించింది. ప్రభుత్వశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో ఆ మహిళ రూ.15 లక్షలు నగదును శివయ్యకు ఇచ్చింది. రెండు ప్రాంతాల్లో ఉద్యోగం వచ్చిందని అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలను శివయ్య ఆ మహిళకు ఇచ్చాడు. అక్కడకు వెళ్లి విచారిస్తే అవి నకిలీవని తెలిసింది. మోసపోయామని తెలుసుకొని, డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు. తనకు న్యాయం చేయాలని మహిళ కోరింది.

● బాలాజీనగర్‌కి చెందిన ఓ వ్యక్తి కుమారుడు లండన్‌లో చదువుతున్నాడు. తన కుమారుడికి నగదు పంపేందుకు చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న అవినాష్‌రెడ్డి అనే వ్యక్తిని సంప్రదించాడు. తాను పంపుతానని అతను చెప్పడంతో రూ.1,02,000ల నగదు ఇచ్చాడు. అతను డబ్బులు పంపకుండా తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడనని బాధితుడు తెలిపారు. విచారించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

● దర్గామిట్టకి చెందిన వ్యక్తి జొన్నవాడలోని ఓ ఆలయ పూజారిగా ఉన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన ఓ మహిళ పూజ చేయించుకోవాలని పూజారిని అడిగి ఫోన్ నెంబర్ తీసుకుంది. అప్పటి నుంచి తరచూ ఫోన్‌లు చేస్తూ తాను చెప్పినట్లు వినాలని, లేకుంటే సోషల్ మీడియా ద్వారా పరువు తీస్తానని వేధిస్తున్నట్లు బాధిత పూజారి ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

● కోవూరుకి చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన రషీద్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. నమ్మిన ఆ యువతి ఇప్పుడు పెళ్లి చేసుకోమని కోరితే ఫోన్‌లోని వీడియోలు చూపించి బెదిరిస్తూ, ఇబ్బందులు పెడుతున్నాడని న్యాయం చేయాలని కోరింది.

● సంగం గ్రామానికి చెందిన అనిల్ తన వెంటపడి వేధిస్తున్నాడని, ఇంటికి వచ్చి బెదిరిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించినా అతని ప్రవర్తనలో మార్పు రావడం లేదని, రక్షించాలని యువతి కోరింది.

● అల్లూరుకి చెందిన వృద్ధురాలిని ఆమె చిన్న కుమారుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆస్తి కోసం ఇబ్బందులు పెడుతున్నాడని, కుమారుడు నుంచి ప్రాణహాని ఉందని న్యాయం చేయాలని కోరింది.

● వలేటివారిపాలెంకి చెందిన ఓ మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్న హోటల్ నడుపుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన మనోజ్ అతని అనుచరులు హోటల్ వద్దకు వచ్చి అల్లరి చేస్తూ గొడవలు చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని ఆమె కోరింది.

మైనింగ్ అవినీతిపై విచారణకు వినతి

నెల్లూరు (వైద్యం) జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): మైనింగ్ మాఫియాపై సీబీఐతో విచారణ జరిపించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్‌ను కాంగ్రెస్ నేతలు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వారు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సైదాపురం మండలంలో రూ. కోట్ల విలువ చేసే తెల్లరాయిని చెన్నై మీదుగా చైనాకి అక్రమంగా పంపుతు న్నారని తెలిపారు. ఇందులో నేతల హస్తంపై నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండా సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సుధీర్, మల్లికార్జునరెడ్డి, ఇర్ఫాన్, అల్లాఉద్దీన్, సుజాత, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో తప్పుడు ఫిర్యాది

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తనపై పలువురు దాడి చేశారంటూ తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడని ఓ యువకుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. శనివారం అర్ధరాత్రి పలువురు దాడి చేసి రాయితో కొట్టారని పోలినాయుడుచెరువుకు చెందిన యస్దానిని అతని సోదరుడు బాబు, బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై విచారించిన పోలీసులు మద్యం మత్తులో వీరంగం సృష్టించి కిందపడడంతో ముఖంమీద గాయాలయ్యాయని, అయితే హత్య కేసులో నిందితుల బంధువులు కొట్టారని తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడని యస్దానిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు. కానీ యస్దాని బంధువులు మాత్రం యస్దానిపై ముగ్గురు వ్యక్తులు మూకుమ్మడి దాడి చేయడంతో గాయాలయ్యాయని చెబుతున్నారు.

మాతా,శిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయి ?

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా,శిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయో పరిశీలించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అధికారులను ఆదేశించారు. ఏప్రిల్, మేలో జరిగిన మాతా,శిశు మరణాలపై సబ్‌కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో చాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి గర్భిణీకి త్వరితగతిన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రు లలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని ఆమె ఆదేశించా రు. పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు ఇచ్చేలా చూడాలన్నారు. పిల్లలకు రక్తహీనత లేకుండా ఐరన్ సిరప్, మాత్రలు తప్పనిసరిగా ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, డాక్టర్ మేరిస్నిగ్ధ, డాక్టర్ శోభారాణి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సిందూజ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత, పాల్గొన్న అధికారులు

ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో అనర్థాలు

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



గుడ్డ సంచులను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ రావు, అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం ప్రజలు అందరూ అలాంటి ప్లాస్టిక్ వాడకాన్ని మానివేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై సోమవారం తిక్కన భవన్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. ఆ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు జిల్లా స్థాయి అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీనెలా నిర్వహించే జిల్లా పరిశ్రమల ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్లాస్టిక్ నిర్మూలన అజెండాగా చేర్చి ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ నివారణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. కాలుష్య ని యంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టాలనే థీమ్‌తో ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల వాడకంపై బుధవారం అన్నీ మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 5వ తేదీన నెల్లూరులో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం గుడ్డ సంచు లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఎంఐపీ పీడీలు నాగరాజకుమారి, గంగా భవానీ, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ధర్నా

నెల్లూరు (వైద్యం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. సోమవా రం కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు గ్రామా ల్లో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని టీడీపీ ఎన్నికల్లో హామీ ఇచ్చిం దన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదయినా ఎక్కడా ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు సిరాజ్, షాన్‌వాజ్, రామరాజు, జిలానీఖాన్, ఆంజనేయులు, ముక్తియార్, బీసీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 525

నలదలపూరులో 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'

వలేటివారిపాలెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నలదలపూరు గ్రామ సచివాలయంలో సోమవారం వ్యవసాయశాఖాధికారులు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏవో హేమంత్‌భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలంలో పిచ్చిరొట్టె విత్తనాలు జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద విత్తనాలు ఎకరాకు 10 నుంచి 15 కిలోలు చల్లుకొని, పూత దశలో ఉన్నప్పుడు దుక్కిలో కలియదున్నితే భూమి సారవంతమవుతుందని తెలిపారు. మండలానికి 160 క్వింటాళ్ల జనుము, 150 క్వింటాళ్ల పిల్లిపెసర పచ్చిరొట్టె విత్తనాలు ప్రభుత్వం నుంచి మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్, కోళ్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కణ్ణన్, రైతులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీ ద్వారా ఆదాయం పెంపే లక్ష్యం

● కే. పెంచలవీరేంద్ర, ఈవోపీఆర్డీ, అల్లూరు



అల్లూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పంచాయతీలో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపడుతున్నాం. తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకున్నాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈవోపీఆర్డీ కె.పెంచల వీరేంద్ర తెలిపారు.

? మండలంలో ఎన్ని సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. వాటి నిర్వహణ, సంపద సృష్టి ఎలా ఉంది.

! మండలంలోని పది పంచాయతీల పరిధిలో 8 సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. అన్నింటిని సిద్ధం చేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నాం.

? వర్మీకంపోస్టు ఎరువులు ఎలా విక్రయిస్తారు. ధర ఎంత.

! వర్మీ కంపోస్టు ఎరువులు అవసరమైన రైతులకు విక్రయిస్తాం. దీనికి కిలో రూ.10 ధర నిర్ణయించామని, అయితే స్థానిక రైతులకు కిలో రూ.2కే విక్రయిస్తామన్నారు.

? గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపడుతున్నారా.

! అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయి. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నాం. మురుగు నీరు నిల్వ లేకుండా చూస్తున్నాం.

? పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది కొరత లేదా, వారికి జీతాలు సక్రమంగా చెల్లిస్తున్నారు.

! పారిశుధ్య సిబ్బంది కొరత లేదు. వీరికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం రూ.6 వేల ఇస్తున్న జీతం సంపద తయారీ ద్వారా వచ్చే ఆదాయంతో రూ.9 వేలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

? ప్లాస్టిక్ వినియోగం నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! 40 మైక్రాన్లకంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్న నిబంధనలు ఉన్నాయి. దాదాపు అన్ని చోట్ల 40 మైక్రాన్లకు మించి ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారు. అంతకంటే తక్కువ మందం కలిగిన కవర్లను వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

ఇప్పుడే ఇలా.. వర్షాలు వస్తే ఎలా?

● పూడికతీతకు నోచుకోక దుస్థితిలో పంట కాలువలు ● కావలి పట్టణానికి పొంచిఉన్న ముప్పు ● ఆందోళనలో ప్రజలు, రైతులు



టీవీ స్టేషన్ వద్ద కంపచెట్లు, గడ్డితో నిండిపోయిన తాళ్లపాలెం చెరువు వరవ కాలువ

కావలి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం, మండలంలో సాగు నీటి కాలువలు పూడికతీతకు నోచుకోక దుస్థితిలో ఉన్నాయి. వాటి రూపురేఖలు మారిపోయి ఉన్న ఈ కాలువలు ఇప్పుడే ఇలా .. వర్షాలు వస్తే ఎలా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోతే రానున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పట్టణ వాసులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నుంచి సాగు నీటిని సరఫరా చేసే కాలువలు పూడిక, గడ్డితో నిండిపోయి మురుగు నీటి కాలువలుగా మారిపోయాయి. పట్టణం లోని పాతూరు నుంచి వెంగయ్యగారిపాలెంలోని కావలమ్మ గుంటకు నీటిని సరఫరా చేసే సాగు నీటి కాలువలు మురుగు నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రానున్న వర్షాలకు ఈ కాలువ గుండా నీటి సరఫరా సాగేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కావలి చెరువు నుంచి పాతూరు గుండా తాళ్లపాలెం జూటూరు చెరువుకు సాగునీటి సరఫరా జరిగే వరవ కాలువకు ఇటీవల పూడికతీత చేపట్టినప్పటికీ పాతూరులోని వెంగయ్యగారిపాలెం రోడ్డులో కాలువ మొత్తం గడ్డి, పూడికతో నిండిపోయింది. వర్షాలకు పట్టణంలోని వర్షపు నీరు మొత్తం ఈ కాలువల గుండానే చెరువులకు చేరాల్సి ఉండగా పూడిపోయిన కాలువలతో పట్టణ వాసులకు వర్షపు నీటి తో ముప్పుతప్పదు. అధికారులు పాలకులు స్పందించి రానున్న వర్షాలకు ముందస్తుగా పట్టణం లోని వరవ కాలువలు, సాగు నీటి సరఫరా కాలువలకు పూడికతీత పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



వెంగయ్యగారిపాలెంలో గడ్డితో నిండిన ప్రధాన పంట కాలువ

కనుల పండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అల్లూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : అల్లూరులోని అభయాంజనేయస్వామి పుష్కరిణి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం హోమం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. రాత్రి ఆదిదంపతులకు ఘనంగా కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చక బృందం మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు.

'108'కి సుస్తీ : సిబ్బంది కుస్తీ



వాహనాన్ని నెడుతున్న 108 సిబ్బంది

కలిగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న '108' వాహనానికి సుస్తీ చేసింది. దీంతో వాహనం స్టార్ట్ కాకపోవడంతో సిబ్బంది సోమవారం ప్రధాన రహదారిపై వాహనాన్ని నెడుతూ కుస్తీ పట్టడం కనిపించింది. కాలం చెల్లిన వాహనం కావడం, బ్యాటరీ పని చేయకపోవడంతో వాహనం తరుచూ మొరాయిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఆపద కాలంలో అత్యవసరంగా సేవలందించే వాహనం పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కంకర రాళ్ల రోడ్డుపై ప్రయాణం ఎలా?



కాకర్లపాలెం రోడ్డుపై లేచిన కంకర రాళ్లు

వలేటివారిపాలెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : తారు రోడ్డు చూశాం, మట్టిరోడ్డు చూశాం, సిమెంట్‌రోడ్డు చూశాం.. ఇప్పుడు కంకర రాళ్ల రోడ్డు చూస్తున్నాం. మండలంలోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుంచి కాకర్లపాలెం వెళ్లే సుమారు రెండు కిలోమీటర్లు రోడ్డంతా కంకరరాళ్లే. బంతుల సైజులో ఉన్న కంకరరాళ్ల రోడ్డుపై నడుస్తూ వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. మెటల్‌రోడ్డుపై ఉన్న మట్టి వర్షానికి కొట్టుకపోవడంతో కంకరరాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల టైర్లకింద కంకరరాళ్లు పడి టైర్లు స్లిప్ అయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఆ రెండు కిలోమీటర్లు తారురోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నరసింహం శరీర భాగాల కోసం గాలింపు

● బోరుబావి చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు ● 25 అడుగుల లోతులో బయటపడ్డ దుస్తులు, అవయవాలు ● సంఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం



ఆర్ఆర్‌పాలెంలో నిమ్మతోట పక్కన ఉన్న బోరుబావి చుట్టూ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

లింగసముద్రం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఆర్ పాలెంలోని నిమ్మతోట పక్కనే ఉన్న పొలంలో గత నెల 30న హత్యకు గురైన తోపూరి నరసింహం శరీర భాగాల కోసం రెవెన్యూ, పోలీస్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బోరుబావి చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టగా 25 అడుగుల లోతులో శరీర భాగాలు, దుస్తులు లభ్యమయ్యాయి. సీఐ మంగారావు, ఎస్‌ఐ నారాయణలు తహసీల్దారు సీతామహాలక్ష్మి నుంచి అనుమతి తీసుకొని మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు. 25 అడుగుల వరకు తవ్విన తరువాత కేసింగ్ పైపును విరగగొట్టడంతో నరసింహం తల, కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలు, చొక్కా, లుంగీ, బనియన్, డ్రాయరు బయటపడ్డాయి. దీంతో నెల్లూరు ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల నుంచి వచ్చిన సహాయ ప్రొఫెసర్లు జి వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, వారి సహాయకుడి ద్వారా గుంతలోని అవయవాలను బయటకు తీయించి ఘటనాస్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దారు సీతామహాలక్ష్మి, వీఆర్‌వో జీ.వినోద్ గ్రామ పెద్దలు నరసింహం మృతదేహానికి పంచనామా నిర్వహించారు. నరసింహం శరీరంలోని కొన్ని భాగాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించాలని వారు పోలీస్‌లకు ఇచ్చారు. మిగిలిన శరీర భాగాలను నరసింహం బంధువులకు అప్పగించడంతో వారు వాటిని జంపాలవారిపాలెంలోని ఇంటికి తీసుకొని వెళ్లి శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.

పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, నిరుపేదలు

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ. సురేష్ బాబు, సీనియర్ నాయకులు పీ. బాలకోటయ్య తదితరులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు చొప్పున నివాసయోగ్యం లేని పేదలందరికీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత జగన్ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన స్థలాలు గృహనిర్మాణంకు సరిపోవని, తమ ప్రభుత్వం వచ్చాక పేదలందరికీ నివాసయోగ్యమైన స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా పట్టించుకోకపోవటం దారుణమని విమర్శించారు. తక్షణం పేదలందరికీ ఇచ్చిన హామీమేరకు స్థలాలు ఇవ్వటంతో పాటు గృహ నిర్మాణంకోసం 5లక్షల రూపాయల ఆర్థికసహాయం అందజేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూడా తక్షణం నెరవేర్చాలని కోరారు. అనంతరం తహసిల్దార్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. మురళీకృష్ణ, వై. ఆనంద్‌మోహన్, నత్తా రామారావు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు, చేవూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు వినతులు

కొండాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని సర్వే చేయించి భూములు అప్పచెప్పాలని వచ్చిన ఆ వినతులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియో గించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపీడీవో ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు

విధ్వంస పాలన నుంచి అభివృద్ధి వైపు అడుగులు

● నేడు పవర్‌పాయింట్ ప్రజంటేషన్

కావలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తూ మంగళవారం కావలిలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ గురించి వివరించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి చేయడానికి ప్రజల కష్టాలను తొలగించటానికి నిరంతరం ప్రజాసేవలోనే ఉన్నానని తెలిపారు. జూన్ 4 నాటికి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఈ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై, అలాగే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన విధ్వంస పాలనపై మంగళవారం ఉదయం 10.30 గంటలకు దొడ్ల మనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయపార్టీల నాయకులకు, పురప్రముఖులకు, పాత్రికేయులకు, ప్రజాసంఘాలను, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వాస్తవాలను ప్రజలకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఒక ప్రజాప్రతినిధిగా ఈకార్యక్రమం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సుహృద్భావ వాతావరణంలో మనందరం మన భవిష్యత్తుకు ప్రణాళికలు నిర్ణయించుకుందామన్నారు.

టీడీపీ కార్యకర్తకు ప్రమాద బీమా



టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా మంజూరు పత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన కావలి పట్టణం ముసునూరుకు చెందిన ఉప్పు గోపాల్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షలను టీడీపీ ప్రమాద బీమా మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లు రూ.5 లక్షల ప్రమాద బీమాను గోపాల్ సతీమణి రమాదేవికి పంపారన్నారు. టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటం వలన గోపాల్ కుటుంబానికి వచ్చిన ప్రమాద బీమా ఆ కుటుంబం ఆత్మస్థైర్యంతో నిలబడేందుకు కొంత ఉపయోగపడుతోందన్నారు. పార్టీ కుటుంబ సభ్యులకు తాను, పార్టీ ఎప్పుడు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో ఆల్ ఇండియా 234 ర్యాంక్



వెంకట మణి ప్రీతమ్

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంకు చెందిన భద్రిరాజు వెంకట మణిప్రీతమ్‌కు సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ (ఐఐటీ) ఆల్ ఇండియా 234 ర్యాంక్ సాధించాడు. ప్రీతమ్ తండ్రి భద్రిరాజు నారాయణ మూర్తి గుడ్లూరులోని జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా, తల్లి రజిని ముండ్లమూరివారిపాలెం జడ్పీ హైస్కూల్‌లో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రీతమ్ సాధించిన ర్యాంక్ పట్ల తల్లిదండ్రులు, బంధుమిత్రులు, తోటి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

● స్పందనకు 866వ ర్యాంకు



స్పందన

కందుకూరు పట్టణంలోని నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థిని పి.స్పందన జాతీయ స్థాయిలో 866వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ర్యాంకు సాధించిన స్పందనను కళాశాల డైరెక్టర్ పి. శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

● జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థులు పి.అశోక్ (1276), షేక్ జబీర్‌సుల్తాన్ (2218), ఏ. విష్ణుప్రియ(2274), బీ.హర్షిత (5765) ర్యాంకులతో మెరిశారని ఆయన తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు బాలభాస్కర్, బెజవాడ నరేంద్రబాబులతో కలిసి అభినందించారు.

ఇళ్ల వద్దనే రేషన్ ఇవ్వాలి : సీపీఎం



ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : ఇళ్ల వద్దనే రేషన్ సరుకులు ఇవ్వాలని కోరుతూ సీపీఎం నేతలు సోమవారం ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల వద్దే రేషన్ పంపిణీ చేసిందని కూటమి ప్రభుత్వం రేషన్ షాపుల వద్దే రేషన్ పంపిణీ చేసే పాత పద్ధతిని తీసుకువచ్చి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ప్రజలకు అనుకూలమైన విధానాలు మానుకుని ప్రజలు ఇబ్బందులు పడే విధానాలు తీసుకురావడం ఆశ్చర్యకరమన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ సరుకుల పంపిణీలో అవినీతి జరిగిందన్న కారణంతో పాత విధానాన్ని తీసేయడం ఎంతవరకు సమంజసమని, అవినీతి జరగకుండా నియంత్రించే మార్గాలెన్నో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి పునరాలోచించాలని, గతంలోవలే సరుకులను ఇళ్ల వద్దకే పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాలు, కృష్ణమోహన, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నరసింహం కుటుంబానికి ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ



హత్యకు గురైన నరసింహం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

లింగసముద్రం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపాలవారిపాలెంలో గత నెల 30న హత్యకు గురైన తోపూరి నరసింహం కుటుంబ సభ్యులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. నరసింహం ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు, టీడీపీ నేత తోపూరి రమేష్, అతని భార్య, జిల్లా టెలికం అడ్వయిజరీ బోర్డు సభ్యులు అనూష, ఇతర కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. నరసింహం హత్య గురించి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నరసింహంను చంపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపాల కృష్ణయ్య, జంపాల శివప్రసాద్, జంపాల శ్రీనివాసులు, అడపా రంగయ్య, పి.గురునాథం, బి.కొండపనాయుడు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, తదితరులు

కావలిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు తనపై చేసిన అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసీపీ ఆధ్వర్యంలో జూన్ 4న తలపెట్టిన వెన్నుపోటు దినంకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి 3వ తేది పట్టణంలోని మనోహర్‌రెడ్డి కల్యాణమండపంలో ఆయన చేసిన అభివృద్ధిపై పవర్ ప్రజంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిసిందని, అనంతరం తాము సమావేశం ఏర్పాటు చేసి దీటుగా సమాధానం చెబుతామన్నారు. తన ఇంటివద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించానని చేసిన ఆరోపణలపై మంగళవారం స్పందిస్తానని, ఎవరి అవినీతికి పాల్పడ్డారో ఎవరు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారో తేలిపోతుందన్నారు. జూన్ 4వ తేదీతో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా వెన్నుపోటు దినంగా జరుపుకుంటున్నామన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజీపీ కృష్ణయ్యచౌదరికి సన్మానం



ఏజీపీ బెజవాడ కృష్ణయ్యచౌదరిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు సివిల్ కోర్టు ఏజీపీగా నియమితులైన బెజవాడ కృష్ణయ్యచౌదరిని కందుకూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణయ్య చౌదరి మూడేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా నిర్వహించటంతో పాటు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీపీ ఎం. ప్రసాదరెడ్డి, న్యాయవాదులు ఎం.మల్లికార్జునరావు, చిడిపోతు హరికృష్ణ, వీవీ సుబ్బారావు, సంపత్‌కుమార్, బీ.మురళీకృష్ణ, పీ.భాస్కరరావు, బీ.రోశయ్య, కె.రాజశేఖరరెడ్డి తదితరులున్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం

కావలిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా పాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని బాస్కెట్ బాల్ కోర్టులో మే 1నుంచి ప్రారంభించిన శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు పీడీ జోసెఫ్‌సుకుమార్ శిక్షణలో చిన్నారులు మెలకువలు నేర్చుకుని క్రీడలో తర్ఫీదు పొందారు. శిక్షణ శిబిరం నిర్వహణకు సహకరించిన విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌రెడ్డి, విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డిలకు జోసఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1 తిరుపతి జిల్లా వార్తలు
మంగళవారం 3 జూన్ 2025

తోతాపురికి 'సిండికేట్' దెబ్బ!

- జిల్లాలో మామిడి రైతుకు ధరాఘాతం
- కలెక్టర్ జోక్యం చేసుకున్నా ఇంకా ఖరారు కాని ధర
- కొనుగోలుకు ముందుకు రాని పల్ప్ యూనిట్లు
- గతేడాది టన్ను రూ.18 వేలు.. ఇపుడు అడిగేవారే కరువు
- కళ తప్పిన మ్యాంగోనగర్, పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లు
- పట్టించుకోని ప్రభుత్వం.. దిక్కుతోచని స్థితిలో రైతాంగం



పుత్తూరు మార్కెట్‌లోని మండీలో రాశులు పోసిన మామిడి కాయలు

గతేడాది హాట్‌కేకుల్లా అమ్ముడైన తోతాపురిపై.. ఈ సీజనులో సిండికేట్ దెబ్బ పడింది! ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం.. పల్ప్ యూనిట్లు సిండికేట్‌గా మారి కొనుగోలుకు ముందుకు రాకపోవడం.. వెరసి మార్కెట్‌కు వచ్చే దిగుబడులను రైతులు తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. గతేడాది టన్ను రూ.18 వేల నుంచి రూ.20 వేలకు పలికిన తోతాపురి రకం మామిడిని ఇప్పుడు రూ.4వేలకు మించి కొనుగోలు చేయడం లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పల్ప్ యూనిట్లు సిండికేట్‌గా మారి.. రైతులను నిలువునా ముంచేస్తున్నా మద్దతు ధర ప్రకటించి నిక్కచ్చిగా అమలు చేయాల్సిన ప్రభుత్వం ఇంకా చోద్యం చూస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి!

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా మామిడి రైతుకు ధరాఘాతం తాకింది. 60 వేల ఎకరాల్లో మామిడి పంట సాగవుతుండగా.. అందులో సింహభాగం తోతాపురి. పల్ప్ తయారీకి ఈ రకాన్ని విరివిగా వినియోగిస్తారు. సీజను మొదలై నెల రోజులవుతున్నా తోతాపురి రకం మామిడి ధర ఇంకా ఖరారు కాలేదు. జిల్లాలోని పల్ప్ తయారీ యూనిట్లు ఇప్పటి వరకూ మామిడి కొనుగోలుకు ముందుకు రాలేదు. మ్యాంగోనగర్ పేరిట దేశవ్యాప్త గుర్తింపు కలిగిన పాకాల మండలం దామలచెరువులోని మార్కెట్‌లో గతేడాది తోతాపురి ధర టన్ను రూ.18 వేలు పలికింది. అయితే ప్రస్తుత సీజను మొదలై నెల దాటుతున్నా తోతాపురి కావాలని అడిగే వారు లేరు. జిల్లాలోని పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లు సైతం ఇదే దుస్థితితో కళ తప్పాయి.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సాగు రాష్ట్రంలోనే అత్యధికంగా ఉండేది. మామిడి పల్ప్ తయారీ యూనిట్లు కూడా ఈ జిల్లా పరిధిలో అత్యధికంగా ఉన్నాయి. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత తిరుపతి జిల్లా పరిధిలో 60 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఇందులో 34 వేల ఎకరాల్లో తోతాపురి రకం మామిడి తోటలున్నాయి. బేనీషా రకం 15 వేల ఎకరాల్లో, నీలం, సిందూర, ఖాదర్ తదితర ఇతర రకాలన్నీ కలిపి మరో 10 వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. జిల్లాలో 21 వేల రైతు కుటుంబాలు మామిడి పంటపై ఆధారపడి ఉన్నాయి. ఇందులో ఉపాధి హామీ పథకం కింద రెండు మూడు ఎకరాల్లో మామిడి పెంపకం చేపట్టిన సన్న, చిన్నకారు మెట్ట రైతులే అధికం. ఏడాదంతా పెట్టుబడి పెట్టి మే-జూన్ రెండు నెలల సీజన్ కోసం ఆశగా వేచి చూసే ఈ రైతు కుటుంబాలకు ఏటా ధరలు చుక్కలు చూపుతున్నాయి. జిల్లాలో ఏడు పల్ప్ తయారీ యూనిట్లు వున్నాయి. పల్ప్ తయారీకి ప్రధానంగా బెంగళూరు కాయలుగా పిలిచే తోతాపురం రకం మామిడినే వినియోగిస్తారు. ఈ యూనిట్ల కొనుగోలు పైనే తోతాపురి మామిడి ధరలు ఆధారపడి వుంటాయి.

మార్కెట్లలో తోతాపురి అడిగే వారేరీ?

గత సీజనుతో పోలిస్తే తోతాపురి ధర పూర్తిగా పడిపోయింది. దామలచెరువు, పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లు ఉన్నాయి. ఈ మూడు మార్కెట్లలో కలిపి ఏటా సీజనులో అన్ని రకాల మామిడి క్రయవిక్రయాలతో రూ.600 కోట్ల నుంచీ రూ.700 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అందులో తోతాపురి వాటాయే అధికం. దామలచెరువులోని మ్యాంగోనగర్ మార్కెట్‌లో గతేడాది తోతాపురి టన్ను రూ.12 వేల నుంచి రూ.18 వేలు పలికింది. ఇపుడు సీజను మొదలై నెల గడుస్తున్నా ఇంతవరకూ ఈ రకం మామిడి కావాలని అడిగే నాథుడు లేడని అటు రైతులు, ఇటు మండీల యజమానులు వాపోతున్నారు. తిరుచానూరు మార్కెట్‌లో గతేడాది తోతాపురి గరిష్ఠంగా టన్ను రూ.20 వేలు పలికితే ఇపుడు గరిష్ఠంగా రూ.4 వేలకు మించి పలకడం లేదు. పుత్తూరు మార్కెట్‌లో కూడా ఈ రకం కాయలను అడిగేవారు లేరు.

ఎందుకిలా?

మే నెలలో కురిసిన అకాల వర్షాలకు 60 శాతానికి పైగా తోటల్లో మామిడి కాయలు త్వరగా పక్వానికి వచ్చేశాయి. దీంతో అనివార్యంగా రైతులు వాటిని కోసి మార్కెట్లకు తరలించాల్సి వస్తోంది. ఇంకా ఆలస్యం చేస్తే చెట్లపైనే మాగిపోయే పరిస్థితి. దానికి తోడు నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రభావం చూపడంతో ఆ మేరకు వర్షాలు మే నెల మూడో వారం నుంచే అడపాదడపా కురుస్తున్నాయి. గాలివానకు కాయలు రాలిపోవడం, దెబ్బతింటాయని రైతులు ఆందోళనతో ఉన్నారు. అందుకే ధరతో నిమిత్తం లేకుండా పంట కోతలు పూర్తి చేసి హడావుడిగా మార్కెట్ బాట పడుతున్నారు. రైతుల దుస్థితిని కొనుగోలుదారులు అవకాశంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

ధర నిర్ణయించని పల్ప్ యూనిట్లు

కొనుగోళ్లు మొదలు కాకపోవడానికి కారణం ఇప్పటి వరకూ ధర నిర్ణయించకపోవడమే. ఏటా మాదిరిగా ఈ సీజను ప్రారంభంలో కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లాలోని ఏడు పల్ప్ యూనిట్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినప్పటికీ ధర మాత్రం నిర్ణయించలేదు. రైతులకు గిట్టుబాటయ్యే ధరతో కొనాలని కలెక్టర్ కోరినా పల్ప్ యూనిట్ల ప్రతినిధులు స్పందించడం లేదు. వారు సిండికేట్ తరహాలో వ్యవహరిస్తున్నా అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. మరోవైపు సప్లయర్స్‌గా పేరు పెట్టుకున్న దళారులు రైతుల నుంచి టన్ను రూ.6 వేలు, రూ.7 వేల చొప్పున కొనుగోలు చేసి పల్ప్ తయారీ యూనిట్లకు తరలిస్తున్నారు. మార్కెట్లలో నిల్వ చేసుకునే సదుపాయం లేనందున రైతులు తక్కువకు కాయలు తెగనమ్ముకుంటున్నారు.

ఏటా దోపిడీయే..

తోతాపురి రకం మామిడి టన్ను రూ.20 వేలు పలికితేనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. అయితే గిట్టుబాటు ధర లభించిన దాఖలాలు ఇప్పటి దాకా లేవు. ఏటా ధరల పతనంతో తోతాపురి రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఉదాహరణకు 2022 సీజనులో తోతాపురి రకం మామిడి సగటున టన్ను రూ. 12 వేలు పలకగా 2023లో రూ. 14 వేలు, 2024లో రూ. 16 వేలు చొప్పున పలికింది. గతేడాది టన్ను రూ. 12 వేల నుంచీ రూ. 18 వేల వరకూ పలికింది. ప్రస్తుత సీజనులో నెల దాటుతున్నా కొనుగోళ్ళు మొదలు కాలేదు. దామలచెరువు, పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లలో టేబుల్ వెరైటీ కింద టాప్ క్వాలిటీ కలిగిన తోతాపురి కాయలను మాత్రమే బయటి నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేసి, నగరాలకు రవాణా చేస్తారు. అయితే ఇవి దిగుబడిలో కేవలం పదిశాతం లోపే వుంటాయి. మిగతా 90 శాతం దిగుబడిని పల్ప్ యూనిట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

కఠిన చర్యలు తీసుకుంటేనే తప్ప!

గతంలో పల్ప్ యూనిట్ల ప్రతినిధులు ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కొనుగోలు చేయని సందర్భాలు తలెత్తినపుడు ప్రభుత్వం నుంచి రాయితీలు ఆపేస్తామని కలెక్టర్లు హెచ్చరించిన ఉదంతాలున్నాయి. ఇప్పుడూ అదే తరహా కఠిన వైఖరి తీసుకుంటే తప్ప తోతాపురి మామిడి రైతులకు గిట్టుబాటు ధర దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటికైనా మామిడి రంగంపై ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాల్సిన అవసరముంది.

రూ.600 కోట్ల ఉత్పత్తులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏటా జిల్లాలో రూ.600 కోట్లకుపైగా మామిడి వ్యాపారం సాగుతోంది. 21 వేల రైతు కుటుంబాలకు, మరెంతో మంది వ్యాపారులు, మండీ ఏజెంట్లు, దళారులు, పల్ప్ యూనిట్ల యాజమాన్యాలు, అక్కడ పని చేసే కార్మికులు, మార్కెట్లలో పనిచేసే కూలీలు... ఇలా వేలాది మందికి ఆదాయాన్నిచ్చే ఈ రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. జిల్లాలో మామిడికి మద్దతు ధర ప్రకటించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. అయినా యూనిట్ల యజమానులు ధరలు ఇంకా నిర్ణయించలేదు. ప్రభుత్వం కూడా మద్దతు ధర ప్రకటించలేదు.



మ్యాంగోనగర్ మార్కెట్‌లోని ఓ మండీలో పక్వానికి వచ్చి మాగిపోయే స్థితిలో ఉన్న తోతాపురి రకం

కాయలు పక్వానికి వచ్చినా ధర నిర్ణయించలేదు!



జిల్లాలో తోతాపురి రకం మామిడి కాయలు 60 శాతం తోటల్లో పక్వానికి వచ్చేశాయి. వాటిని చెట్లపై వదిలేసే పరిస్థితి లేదు. వర్షాల సీజను మొదలైంది. ఎప్పుడు గాలి వాన వస్తుందో తెలీదు. గాలివానలకు కాయలు దెబ్బతింటాయి. అందువల్ల రైతులంతా కాయలు కోసేసి మార్కెట్‌కు తెచ్చేస్తున్నారు. కానీ జిల్లాలో పల్ప్ తయారు చేసే యూనిట్ల యాజమాన్యాలు ఇంత వరకూ ధర నిర్ణయించలేదు. ఇప్పటికే సగం సీజను గడిచిపోయింది. ఇప్పటికైనా ధర నిర్ణయిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- గిరిధర్‌రెడ్డి, మండీ యజమాని, దామలచెరువు మ్యాంగోనగర్ మార్కెట్

తోతాపురి కొనేవాళ్లు లేరు!



ఈసారి సీజను అధ్వానంగా వుంది. తోతాపురి కేజీ రూ. 3 నుంచి రూ. 4 కూడా పోవడం లేదు. అసలు తోతాపురి అడిగేవాళ్లే లేరు. వానలు పడేకొద్దీ కాయలు కొనడం ఇంకా తగ్గిపోతుంది. మార్కెట్ పరిస్థితి ఏమీ బాగాలేదు. రైతులకు కోత కూలి, ట్రాక్టరు బాడుగలకు కూడా రావడం లేదు. గతంతో ఈ సీజనుకు పోలికే లేదు.

- రామచంద్ర, మండీ యజమాని, తిరుచానూరు మార్కెట్

కలెక్టర్ చెప్పినా పరిశ్రమలు వినడం లేదు!



జ్యూస్ ఫ్యాక్టరీల వాళ్లంతా సిండికేట్ అయ్యారు. ప్రభుత్వం తరపున కలెక్టర్ చెప్పినా రైతులకు గిట్టుబాటు రేటు ఇవ్వడం లేదు. వానలొచ్చినా, ఎండలు కాసినా ఫ్యాక్టరీల వాళ్లు నిర్ణయించిన రేటుకే జ్యూస్ బాటిళ్ల అమ్ముతున్నారు. రైతు పండించిన పంటకు మాత్రం ఎందుకు రేటులో హెచ్చుతగ్గులు?

- కేశవులు, మామిడి రైతు, కేబీఆర్‌పురం, పుత్తూరు మండలం

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 589మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,913, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,105 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,152మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,304, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 469, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 261, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 63మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,051 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



సోమల సమీపంలో రోడ్డు పక్కన పారబోసిన తోతాపురి మామిడి కాయలు

రైతు కష్టం.. రోడ్డు పాలు!

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలు నాణ్యత లేదని కొనేవారు కరువయ్యారు. ఒకవేళ కొన్నా గిట్టుబాటూ ధరా లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఏడాదిపాటు కష్టించి సాగుచేసిన మామిడి కాయలను ఏం చేయాలో తెలియక రైతులు.. రోడ్డు పాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా తసోమల - సదుం, సోమల - కలికిరి మార్గాల్లో రోడ్లపక్కన పారబోసిన మామిడి కాయలే కనిపిస్తున్నాయి.

సర్వర్ డౌన్

- రేషన్ సరుకుల పంపిణీలో అవస్థలు
- రెండో రోజు తెరుచుకోని 50 షాపులు



తిరుపతిలో సర్వర్ పనిచేయలేదంటూ కార్డుదారుకు చెబుతున్న డీలరు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఎర్రర్, మరోసారి ప్రయత్నించండి.. సర్వర్ డౌన్‌తో ఈపోస్ యంత్రంలో పదే పదే ప్రత్యక్షమైన పదాలివి. ఇలా.. సోమవారం ఉదయం నుంచీ జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీకి తరచూ అంతరాయం ఏర్పడటంతో కార్డుదారులు, డీలర్లు ఇబ్బంది పడ్డారు. తిరుపతితో పాటు దాదాపు 90 శాతం దుకాణాల్లో ఉదయం 11.15 నుంచి రెండు గంటల పాటు సర్వర్లు పూర్తిగా డౌన్ అయ్యాయి. దీంతో నిత్యావసర వస్తువులు పంపిణీ బాగా మందగించిందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి నిలబడిన కార్డుదారులకు సకాలంలో సరుకులు అందక అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలామంది తిరుగు ముఖం పట్టారు. కొందరు డీలర్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా.. సెంట్రల్ సర్వర్ మొరాయించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలిపారు. సర్వర్లు మొరాయిస్తుండడంతో కార్డుకు ఫింగర్ ప్రింట్ వేసి, లాగిన్ కావడం నుంచి.. బియ్యం వేసే వరకు కార్డుకు 25 నిమిషాలు నుంచి అర గంట వరకు సమయం తీసుకుంటుందని శివజ్యోతినగర్ డీలర్ చెప్పారు. తాను సాయంత్రం 4 నుంచి ఏడు గంటల వరకు కేవలం తొమ్మిది కార్డులకు మాత్రమే బియ్యం, చక్కెర ఇవ్వగలిగానని తెలిపారు. ఒకే సారి వేలాది మంది డీలర్లు లాగిన్ కావడంతో సమస్య ఉత్పన్నమైందని రెండు మూడు రోజుల్లో అంతా సర్దుకుంటుందని అధికారులు చెపుతున్నారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును ఆంధ్రజ్యోతి సంప్రదించగా సర్వర్లు డౌన్ అయిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఇదిలా వుండగా వివిధ కారణాలతో జిల్లాలోని 1457 దుకాణాల్లో రెండవ రోజు 50 మంది డీలర్లు దుకాణాలు తెరచి సరుకులు పంపిణీ చేయలేదని డీఎస్‌ఓ చెప్పారు. 15వ తేది వరకు సరుకుల పంపిణీకి సమయం ఉందని, అవసరమైతే ఒకట్రెండు రోజులు గడువు పెంచే అవకాశం ఉంటుందని, అందువల్ల కార్డుదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కాగా, రెండో రోజు దాదాపు 32,541 మందికి బియ్యం పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇది తొలి రోజు కేవలం 16 శాతం మందికి మాత్రమే సరుకులు కావడం గమనార్హం.

ఏనుగుల దాడులపై నేడు ప్రజలకు అవగాహన

భాకరాపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శేషాచల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల కదలికలు.. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జనార్దన్ రాజు తెలిపారు. మండలంలోని చిట్టేచర్ల పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌తో పాటు అటవీశాఖ అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు, రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

8న తిరుపతిలో
హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ వేడుక
సినీ దిగ్గజాలు చిరంజీవి, రజనీకాంత్ రాక

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక ఈనెల 8న తిరుపతి ఎస్వీయూ తారక రామ మైదానంలో జరగనున్నట్లు సమాచారం. ఈ మేరకు అనుమతి కోసం చిత్రనిర్మాత ఏఎం రత్నం ఎస్వీయూ వీసీకి లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యఅతిథులుగా తెలుగు, తమిళ సినీ దిగ్గజాలు మెగాస్టార్ చిరంజీవి. సూపర్‌స్టార్ రజనీకాంత్, పవన్‌కల్యాణ్‌తో పాటు నటీనటులు నిధిఅగర్వాల్, బాబిడియోల్, సత్యరాజ్, మరో నిర్మాత దయకర్‌రావు హాజరు కానున్నట్లు సమాచారం. వీరంతా ఈవెంట్ ముగిశాక రాత్రికి తిరుమల చేరుకుని, మరుసటి రోజు ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నట్లు సమాచారం.


సంజయ్ మూర్తి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూన్2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా సంజయ్ మూర్తి, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ బొలి శెట్టి సత్యనారాయణ, సినీనటుడు శుభలేఖ సుధాకర్, ఆయన సతీమణి, గాయని ఎస్పీ శైలజ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


శుభలేఖ సుధాకర్, శైలజ

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్‌లో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.46 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,031

తలనీలాలు సమర్పించినవారు: 32,936



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు

● జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్‌లో ఎంపికైన సుమారు వెయ్యి మంది ఈ పరీక్ష రాశారు. పలువురు జాతీయ స్థాయిలో ఉన్నత ర్యాంకులు పొందారు. తమ మనోభావాలను వారు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఏఐలో రీసెర్చ్ చేస్తా



ఐఐటీ ముంబైలో సీటు సాధించి సీఎస్ఈ చదివి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో రీసెర్చ్ చేయాలనేది నా ఆశయం. ఇందుకోసం కళాశాల అధ్యాపకులు ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలను సమగ్రంగా అధ్యయనం చేయించారు. ఓల్డ్ పేపర్స్ ప్రాక్టీస్ చేయించారు. కళాశాలలో మాక్‌టెస్టులు, రివిజన్‌వల్ల సబ్జెక్ట్‌పై పట్టు వచ్చింది. అధ్యాపకుల సూచనల మేరకు చదువుతూ, సాధన చేశా. మా నాన్న జైభారత్, (ప్రైవేట్ కాలేజీలో గణిత అధ్యాపకుడు), అమ్మ సురేఖ ఎంతగానో ప్రోత్సహించారు.

- ఎం.భానుచరణ్‌రెడ్డి, ఓపెన్ కేటగిరిలో 51, ఈడబ్ల్యుఎస్ 4వ ర్యాంకు

ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ చదువుతా



ప్రతిష్ఠాత్మక ఖరగ్‌పూర్, చెన్నై ఐఐటీల్లో సీఎస్ఈ చదవాలనేది నా లక్ష్యం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, నాన్న గిరిజా ప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో, అగ్రికల్చరల్ కళాశాల ప్రొఫెసర్ అయిన అమ్మ అమరావతి ప్రోద్బలంతో ఇంజినీరింగ్ వైపు అడుగులు వేశాను. మా కళాశాల అధ్యాపకులు సూచించిన మేరకు చదివి ఉత్తమ ర్యాంకు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.

- దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి, 345వ ర్యాంకర్.

మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చేస్తా



మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరడాలనేది నా కోరిక. నాన్న నాగేంద్ర (వెటర్నరీ డాక్టర్) నాగేంద్ర, అమ్మ జ్యోతి ప్రోద్బలంతో కష్టపడి చదివా. మా అధ్యాపకుల శిక్షణ, ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అధ్యయనం, కళాశాలలో మాక్ టెస్టులు నన్ను నేను తీర్చిదిద్దుకునేందుకు ఎంతగానో ఉపకరించాయి.

- జి.హిమేష్ రాఘవచంద్ర, 468వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 61వ ర్యాంకు.

టాప్ 5 ఐఐటీల్లో చదవాలన్నది లక్ష్యం



దేశంలోని టాప్ ఐదు ఐఐటీల్లోని ఒకదానిలో సీఎస్ఈ చదవాలనేది నా లక్ష్యం. కష్టపడి చదివి మంచి ర్యాంకు తెచ్చుకోవడంతో నా లక్ష్యం నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉంది. నాన్న ప్రహ్లాద్‌రెడ్డి (ప్రైవేట్ స్కూల్ టీచర్), అమ్మ రెడ్డిరాణి నన్ను కష్టపడి చదివించారు. మా కళాశాల అధ్యాకుల బోధన, వారి అత్యుత్తమ ప్రణాళిక నన్ను ఈ విజయబాటలో నడిపింది.

- ఎం.శశాంక్, 618వ ర్యాంకర్

ఐఐటీ ముంబైలో చదువుతా



మా కళాశాల అధ్యాపకుల నేతృత్వంలో ముంబై ఐఐటీలో సీటు సాధించాలనే పట్టుదలతో చదివాను. నాన్న కె.నాదమునిరెడ్డి (కెమిస్ట్రీ లెక్చరర్), అమ్మ ఎం.బిందు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

- కళత్తూర్ యశ్విత, 906వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్‌లో 67వ ర్యాంకు

గూడూరు విద్యార్థికి 535వ ర్యాంకు


తల్లిదండ్రులతో నితిన్‌రెడ్డి

గూడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఇంటర్ చదివిన గూడూరు విద్యార్థి వేగూరు నితిన్‌రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా 535వ ర్యాంకు వచ్చింది. తండ్రి రవిచంద్రారెడ్డి (టీచరు), తల్లి సుచిత్ర (వెల్ఫేర్ అసిస్టెంట్), అధ్యాపకుల ప్రోత్సాహంతో తాను ఈ ర్యాంకును సాధించానని, ప్రతిష్ఠాత్మక ఐఐటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా రాణించాలన్నదే లక్ష్యమని చెప్పారు.

వినుడు.. మా గోడు

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 299 వినతులు ● రెవెన్యూ శాఖవే 158

● సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపొద్దన్న కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమ గోడు పట్టించుకుని, సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు తరలివచ్చారు. వీరితో కలెక్టరేట్ కిక్కిరిసింది. వివిధ సమస్యలపై 299 అర్జీదారులు అందగా, అందులో 158 రెవెన్యూశాఖవే కావడం గమనార్హం. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, ఇందులో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. పరిష్కరించలేని అర్జీకు వాటిపై ఫిర్యాదుదారులకు కారణాలు చెప్పాలన్నారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా, పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలవడానికి వచ్చే అర్జీదారులను ఒక క్రమ పద్ధతిలో సమావేశ మందిరంలోకి అనుమతించాలి. జీఎస్ డబ్ల్యూ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహంతో కలెక్టర్ కోసం ఒకటి.. ఇతరుల మరొకటి అంటూ రెండు లైన్లలో పంపడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఈ విషయం తెలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహించడంతో ఒక లైనులోనే అనుమతించారు.

తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామానాయుడు, రైతు సంఘ నాయకులు

మామిడిలో ఎక్కువగా తోతాపురి రకం అధిక దిగుబడి వస్తుందని, గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం చేయాలని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. తోతాపురి రకానికి సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ రకం మామిడిని పండించడానికి టన్నుకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చవుతోందని చెప్పారు. కాబట్టి టన్నుకు రూ.30వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టేబుల్ వెరైటీలను రైతు బజారులో ప్రభుత్వం ద్వారా విక్రయించి కనీస ధర ఉండేలా చూడాలన్నారు. మామిడి పల్ప్‌ను దేవాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, గోపాల్‌రెడ్డి, హేమలత, వెంకయ్య, పద్మనాభం, అయ్యప్పనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత మా భూమి ఆక్రమించారు

మా పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేత సురేష్‌రెడ్డి ఆక్రమించాడు. అందుకు రెవెన్యూ వాళ్లు సహకరించారు. ప్రభుత్వం మారింది. మా భూమిని మాకు ఇప్పించి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- మహేష్, అలిమిలి గ్రామం

శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి



తిరుపతి అర్బన్ తిమ్మినాయుడు పాలెం హరిజనవాడలో 4 వేలు కుటుంబాలకు శ్మశాన వాటిక లేక ఇబ్బందిగా ఉందని ఏపీ అంబేడ్కర్ యువజనసంఘం నేత వెంకటరత్నం అన్నారు. 2018లో గ్రామానికి ఉత్తరం వైపున నిరుపయోగంగా ఉన్న అటవీ శాఖ భూమిని కేటాయించాలని అప్పటి జిల్లా అధికారులు ఆదేశించారన్నారు. ఇప్పటికీ శ్మశాన వాటిక కోసం స్థలం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.

ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



తిరుపతి అర్బన్ మండలం వేణుగోపాల్ కాలనీలో వారం కిందట ఇళ్లను కూల్చివేసిన వారిపై కఠిన కేసులు నమోదుచేసి బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ ఘటనలో ప్రమేయమున్న రాజన్‌బాబు, నిర్మల, రమణారెడ్డి, చంద్రగిరి మస్తాన్, మునిరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదం ఉన్న స్థలాలను మోసం చేసి అమ్మిన రుద్రగోపి, శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి వర్గ సభ్యులు మాధవ, బుజ్జి, బాధితులు వెంకటేష్, శ్రీరాములునాయక్, రిషిరెడ్డి, శివమణి, వెంకటేష్, పద్మావతి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

మాపై అక్రమకేసులు

బాలయ్యపల్లి మండలం సరిహద్దు, వెంకటగిరి మండలం సరిహద్దు వద్ద మర్ధనపల్లెలో పూర్వీకుల నుంచి మా అధీనంలో భూములను సాగుచేసుకుంటున్నారు. శ్రీకాళహస్తికి చెందిన కొంతమంది ఆ భూమికి కంచె వేస్తుంటే అడ్డుకున్నాం. మాపై అకారణంగా ఎస్ఐ సహకారంతో అట్రాసిటీ కేసు పెట్టి వేధిస్తున్నారు. సంబంధం లేని వ్యక్తుల ద్వారా తప్పుడు కేసులు బనాయించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి.

- వెంకటేశ్వర్లు. అక్కసముద్రం, బాలయపల్లి

ఉపాధి కల్పించండి



సారూ.. మాకు ఏడేళ్ల కిందట వివాహమైంది. నేను, నాభర్త దివ్యాంగులం. మాకు ప్రభుత్వం తరపున దివ్యాంగుల కోటలో జీవనోపాధి కల్పించి ఆదుకోవాలి. పూట గడవడానికికూడా కష్టంగా ఉంది.

- మయూరి, ప్రదీప్, పేరూరు, తిరపతి రూరల్ మండలం

ప్రభుత్వ భూములు విక్రయిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన డీటీ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి భూఆక్రమణలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

ఆదుకుంటామని చేతులెత్తేశారు



ఇటీవల ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని ఓ కంపెనీలో భవన నిర్మాణం పనిచేస్తుండగా కటింగ్ మిషన్‌తో కాలు తెగిపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొంది కూలీపనులకు వెళ్లలేక ఇంటికే పరిమితమయ్యా. అప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కంపెనీ నిర్వాహకులు ఇప్పుడు పట్టించుకోవడంలేదు. నాకు న్యాయం చేయండి.

- విజయకుమార్, మేస్త్రీ, రేణిగుంట

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ల చోరీల ముఠా

● ఎనిమిది మంది నిందితుల అరెస్టు


మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో గత ఏడాది నుంచి రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మలర్లు, మోటర్లు, స్టార్టర్లు, కేబుల్‌వైర్లు చోరీ చేసే ముఠాను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లలో రాగి వైరు, బోరులో కేబుళ్ల చోరీపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గాజులమండ్యం ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. ఏర్పేడు, గాజులమండ్యం పోలీసులు ఏర్పేడు మండలంలోని వికృతమాల సమీపంలో ఉన్న టీసీఎల్ పరిశ్రమ వద్ద సోమవారం తెల్లవారజామున ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన వెంకట్రామయ్య, కత్తిమణి, జండా వెంకటేష్‌ను స్టేషన్‌కు తరలించారు. వారు చోరీ చేసిన రాగివైరు, బోరు కేబుళ్లను కొనుగోలు చేసిన తిరుపతికి చెందిన ఎస్కే ఖాదర్‌బాషా, సయ్యద్, హుస్సేన్, షేక్ బషీద్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన షేక ఉస్మాన్, వెంకటగిరికి చెందిన గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది నిందితుల నుంచి 795 కిలోల రాగివైర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సత్యసాయి జిల్లాకు శివప్రసాద్

● నాన్ ఫోకల్ పోస్టు ఇవ్వాలని ఉత్తర్వు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారులో రేణిగుంట, కడప రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ అవినీతి ఆరోపణలతో సస్పెండైన సిద్దాల శివప్రసాద్‌ను సత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కడప రూరల్ తహసీల్దార్‌గా ఉన్న సమయంలో గత ఏడాది ఏప్రిల్ 8న ఏసీబీకి చిక్కి సస్పెండయ్యారు. సస్పెండైన ప్రభుత్వ ఉద్యోగికి ఏడాది తర్వాత పోస్టింగ్ ఇవ్వాలన్న నిబంధన మేరకు సదరు అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గత నెల 18న సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్‌ను రీవోక్ చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. అయితే తిరుపతి అర్బన్ తహసీల్దారుగా కూర్చోవాలని రాజకీయ నాయకులతో ఈయన అధికారులపై ఒత్తిడి చేయించినట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఇతడి వ్యవహార శైలి, వివాదాస్పద పనితీరు తెలిసి అతడ్ని తహసీల్దార్ల కొరత ఉన్న సత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను సవరించింది. అదికూడా నాన్ ఫోకల్ పోస్టులో వేయాలని ఆ జిల్లా కలెక్టర్‌కు సూచిస్తూ, తిరుపతి జిల్లా నుంచి వెంటనే రిలీవ్ చేయయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వైభవంగా ధ్వజారోహణం


పెద్దశేష వాహనంలో ఉత్సవర్లు

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవర్లు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఆలయానికి వేంచేపుచేసి విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణలు నడమ ఉదయం 7.02-7.20గంటల మధ్య మిథున లగ్నంలో గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివార్లకు ఆస్థానం, స్నపన తిరుమంజనం కావించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి పెద్దశేష వాహనంలో స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. జీయ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.





నేడు సీనియర్ పురుషుల క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ మెన్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవి ఓ ప్రకటనలో తెలిపారు. వాల్మీకిపురం, తిరుపతి, చిత్తూరు, మదనపల్లె క్రికెట్ మైదానాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రి, ఆధార్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న చెరువులకు రూ.78.50 లక్షలు

● తిరుపతి, చిత్తూరు జిల్లాలకు మంజూరు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గతేడాది ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 78.50 లక్షలు మంజూరు చేసింది. గతేడాది నవంబరు 30వ తేదీ నుంచీ డిసెంబరు 2వ తేదీ నడుమ ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ రెండు జిల్లాల్లో పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు దెబ్బతిన్నాయి. వాటి తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 9.54 కోట్ల నిధులు అవసరమని మైనర్ ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల సహాయక నిధుల నుంచీ రూ. 78.50 లక్షలు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు జిల్లాల్లో దెబ్బతిన్న చెరువులను తాత్కాలిక ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ. 9.54 కోట్లు అవసరమవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి పంపితే ఆరు నెలలు ఆలస్యంగా అది కూడా అరకొర నిధులు మంజూరు చేసింది. జనవరి నుంచీ మే దాకా పెద్దగా వర్షాలు కురిసే ఐదు నెలల పాటు పట్టించుకోకుండా తీరా నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే సమయంలో చెరువుల మరమ్మతులకు నిధులివ్వడం విమర్శలకు దారి తీస్తోంది. వర్షాలు కురిసే సమయంలో చెరువులకు మరమ్మతులు చేయడం ఇబ్బందికరమన్న అంశాన్ని ప్రభుత్వం విస్మరించడం గమనార్హం.

షార్టు సర్క్యూట్‌తో కారు దగ్ధం

● ఆరుగురు ప్రయాణికులు సురక్షితం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీల్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా కాలిపోయిన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక శాఖాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి కథనం మేరకు.. చెన్నైకు చెందిన ఎస్.ధర్మచంద్ కుటుంబ సమేతంగా.. మొత్తం ఆరుగురు కారులో (టీఎన్20బీడీ 6211) తిరుమలకు బయలుదేరారు. తిరుచానూరు రోడ్డులోని పిల్లర్ నెంబరు 28 వద్దకు కారు రాగానే బ్యాటరీలో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. కారులోని ఆరుగురు హుటాహుటిన కిందకు దిగేయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. తిరుపతి అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలు అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో దాదాపు రూ రెండు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గ్రామదేవత ఊరేగింపులో అపశ్రుతి
విద్యుదాఘాతంతో నలుగురికి గాయాలు

ఓజిలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో గ్రామ దేవత ముంగమూరమ్మ ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. ముంగు మూరమ్మ ఉత్సవాలను పురస్కరించు కుని సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఉత్సవ రథానికి వీధిలో విద్యుత్ తీగలు తగలడంతో తెగిపడి పోయాయి. అదే సమయంలో గ్రామ దేవతకు హారతి, నైవేద్యం సమర్పిస్తున్న గౌరి, ఆమె భర్త నాగూరయ్య, అతని కుమారుడు, మరో ఇద్దరు బంధువులు విద్యుదాఘాతానికి గురయ్యారు. గాయ పడిన వారిని చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. వీరిలో గౌరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు
ఆగిన విద్యుత్ సరఫరా
15 గంటల తరువాత పునరుద్ధరణ

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలోని ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం 15 గంటలపాటు విద్యుత్ ఆగి పోయింది. తహసీల్దారు, ఎంపీడీవో, ఎమ్మార్సీ, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్, వెలుగు, పోలీస్‌స్టేషన్, ఐసీడీఎస్, బాలసదనం, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. సోమవారం మధ్యాహ్నం వరకూ విద్యుత్ రాకపోవడంతో ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉక్కపోత తట్టుకోలేక కొంతమంది కార్యాలయాల బయటకు వచ్చి సేదతీరారు. ట్రాన్స్‌కో అధికారులు ఆలస్యంగా స్పందించి సాయంత్రం నాలుగు గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

వాహనం ఢీకొని
గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - ఎల్‌పి సాగరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి జాతీయ రహదారి సమీపంలో వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నలుపు, తెలుపు, గడుల చొక్కా ధరించి ఉన్నాడు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

తుఫాన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు సంభవించినప్పుడు అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలి.. తదితర అంశాలపై డివిజన్ స్థాయి అధికారులతో ఆర్డీవో కిరణ్మయి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల అధికారులు నిత్యం ప్రజలతో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఏవో రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య, సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట తహసీల్దార్లు నరసింహారావు, శరత్‌బాబు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి మూడు సవర్ల సరుడును గుర్తు తెలియని యువకుడు లాకెళ్లాడు. పట్టణంలోని కొత్త బీడీ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రమ్మ ఆదివారం సాయంత్రం గ్రీన్‌సిటీ సమీపంలో వాకింగ్ చేస్తుండగా మోటారు సైకిల్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు చంద్రమ్మ మెడలో సరుడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో సోమవారం పాముకాటుకు గురైన రైతు వెంకటేశ్వర్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు పొలంలో వేరుశనగ పంటను పరిశీలిస్తూ వెళ్తుండగా పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబసభ్యులు గూడూరు ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసు నమోదు

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని అంబేడ్కర్ గురుకులం సమీపంలో కుదురు రమణయ్యపై హత్యాయత్నం జరిగినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. రమణయ్య కోట బజారుసెంటర్ నుంచి తాను నివాసం ఉంటున్న కోటమ్మగుడి కాల నీకి మోటరు బైక్‌లో వెళ్తుండగా గురుకులం క్వార్టర్స్ వద్ద గుర్తుతెలి యని వ్యక్తులు కారం చల్లి హత్యాయత్నం చేయబోయారని, కేకలు వేయడంతో నిందితులు పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీక రించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో 30ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. మండలంలో అనుమతి లేకుండా నిర్మించుకున్న 360 ఇళ్లను గుర్తించామని, అయితే 80 దరఖాస్తులే అందాయన్నారు. మిగిలినవారు కూడా దరఖాస్తు చేసుకొని తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

జనసేన వలంటీర్లకు సభ్యత్వ కిట్ల అందజేత

గూడూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక వలంటీర్లకు సోమవారం సభ్యత్వ కిట్లు అందజేశారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5లక్షలు, ప్రమాదాలకు లోనైన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందించేలా పార్టీ చర్యలు తీసుకుందని జనసేన నాయకుడు మునిగిరీష్ తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులపై ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ సమీక్ష జరిపారు. గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌కుమార్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి

డక్కిలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. సోమవారం రెవెన్యూ కార్యాయలంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు అందుతున్నాయని, రీ సర్వే పూర్తి చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ

బాలాయపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామంలో సర్పంచు యల్లంటి కృష్ణయ్య ఆద్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేత సుధాకర్‌రాజు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.